

త్వరలో ప్రధాని మోదీ అనకాపల్లి రాక?



అనకాపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నేపథ్యంలో వచ్చే నెల మొదటి వారంలో జిల్లాలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటించనున్నారని తెలిసింది. ఆ రోజు అనకాపల్లిలో జరిగే ఎన్నికల బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తారని సమాచారం. అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు మద్దతుగా ప్రచారం చేయనున్నారు. అయితే ఉత్తరాదిలో ఎన్నికల ప్రచారం బిజీలో మోదీ ఉన్నందున ఆయన పర్యటన తేదీ, వివరాలు అధికారికంగా ప్రకటించలేదు.

ధరల మంట



ఐదేళ్లలో రెట్టింపు అయిన నిత్యావసర సరకుల ధరలు

సరకు	నాటి ధర 2018 (డిసెంబరు)	ప్రస్తుతం
పంచదార	22	48
పెసరపప్పు	70	134
కందిపప్పు	94	186
మినపప్పు	78	156
బియ్యం(25కేజీ)	1000-1100	1400-1800
గోధుమ పిండి	32	67
ఇడ్లీ రవ్వ	28	45
ఉప్మా రవ్వ	39	60
పామాయిల్	72	95
వేరుశనగనూనె	102	175

- బియ్యం 25 కిలోల బస్తాపై రూ.400 నుంచి రూ.600 వరకూ పెరుగుదల
- ఒక్కో కుటుంబంపై రూ.4 వేలు నుంచి రూ.6 వేలు అదనపు భారం
- ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న సాధారణ, మధ్య తరగతి కుటుంబాలు
- అప్పులు చేయాల్సిన పరిస్థితి
- ధరల నియంత్రణలో వైసీపీ సర్కారు విఫలం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

'నిత్యావసర సరకుల ధరలు భారీగా పెరిగిపోయాయి. గడిచిన ఐదేళ్లలో ప్రతి వస్తువు ధర రెట్టింపు అయింది. ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పి...నిత్యావసర సరకులు, ఇతర వస్తువుల ధరలను పెంచి సాధారణ, మధ్య తరగతి ప్రజలపై తీవ్ర ఆర్థిక భారాన్ని మోపుతున్నాయి. గతంలో నిత్యావసర సరకులకు నెలకు ఐదు వేల రూపాయలు అయ్యేవి. ఇప్పుడు పది వేలు దాటిపోతోంది. ఆదాయంలో రూపాయి పెరుగుదల లేదు. పైపెచ్చు కరోనా తరువాత జీతాల్లో కోతలు. ఇలా అయితే ఎలా బతకాలో అర్థం కావడం లేదు"

- ఇదీ ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తూ కుటుంబ భారాన్ని మోస్తున్న విశాఖలోని హెచ్‌బీ కాలనీకి చెందిన లలితకుమారి ఆవేదన. సాధారణ, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారంతా ధరల పెరుగుదలతో చాలా ఇబ్బందిపడుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గడిచిన ఐదేళ్లలో నిత్యావసర సరకుల ధరలు రెట్టింపయ్యాయి. ఒక్కో కుటుంబంపై కనీసం నాలుగు వేల నుంచి ఎనిమిది వేల వరకూ అదనపు భారం పెరిగింది. ఏటా పెరుగుతున్న ధరలతో కుటుంబ పోషణ కష్టమవుతోందన్న భావనను అందరూ వ్యక్తంచేస్తున్నారు. నిత్యావసర సరకులతోపాటు పిల్లల ఫీజులు, ఇతర ఖర్చులు భారీగా పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పెరిగిన ఖర్చులకు అనుగుణంగా వేతనాలు పెరగకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని శివాజీపాలెం ప్రాంతానికి చెందిన రోహిణి వాపోయారు.

భారీగా పెరిగిన ధరలు

గడిచిన ఐదేళ్లలో నిత్యావసర సరకులైన ఉప్పు, పప్పు, వంటనూనెలు వంటి వాటి ధరలు భారీగా పెరిగిపోయాయి. ఐదేళ్ల కిందట ... మిగతా 8వ పేజీలో

ఐదేళ్లలో అన్ని ధరలు రెట్టింపు



ఐదేళ్లలో నిత్యావసర వస్తువులతో పాటు అన్ని ధరలూ పెరిగాయి. బియ్యం, పప్పుదినుసులు, వంట నూనె ధరలు రెట్టింపు అయ్యాయి. విద్యుత్ చార్జీలు బాగా పెరిగాయి. ఆర్టీసీ చార్జీలు కూడా రెట్టింపు అయ్యాయి. ఏ విధంగా చూసినా ఏ ధరలూ సామాన్యులకు అందుబాటులో లేవు.

- ఉపాధ్యాయుల శ్రీనివాస్. చిరు వ్యాపారి, చోడవరం

విపరీతంగా పెరుగుదల



ఈ ఐదేళ్లలో ధరలు విపరీతంగా పెరిగాయి. నిత్యావసర ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇంటి పన్నులు ఎవరికీ తెలియకుండానే 15 శాతం పెంచుకుంటూ పోయారు. దీనికి తోడు ప్రతి నెలా చెత్త పన్ను వసూలు చేస్తున్నారు. విద్యుత్ బిల్లులు దారుణంగా వస్తున్నాయి. ధరలు విపరీతంగా పెరగడం వల్ల సామాన్యులు జీవించడం కష్టంగా ఉంది.

- కేఎన్‌వీ సత్యనారాయణ, అనకాపల్లి

అందుబాటులో లేవు



గత ఐదేళ్లలో నిత్యావసర ధరలు రెట్టింపు అయ్యాయి. గతంలో బియ్యం 25 కిలోల బస్తా రూ.1150- 1250 ఉండేది. ఇప్పుడు రూ.1700కి పెరిగింది. రూ.80 ఉండే కంది పప్పు ఈ ఐదేళ్లలో రెట్టింపు అయ్యింది. పేద, మధ్యతరగతి ప్రజల జీవన ప్రమాణాల్లో పెద్దగా మార్పు రాలేదు. పెరిగిన విద్యుత్, నిత్యావసర ధరల కారణంగా నెలవారీ ఖర్చులు పెరిగిపోయి బతకడం చాలా కష్టంగా ఉంది.

- కర్రి మురళీకృష్ణ, ప్రైవేటు ఉద్యోగి, నర్సీపట్నం

షుగర్ ఫ్యాక్టరీల అభివృద్ధి ఉత్తి మాటేనా?

జిల్లాలోని సహకార షుగర్ ఫ్యాక్టరీలను లాభాల బాట పట్టిస్తానని పాదయాత్రలో జగన్ హామీ


- గోవాడ షుగర్స్‌కు మంచి రోజులంటూ ఊకదంపుడు
- వైసీపీ అధికారంలోకి వచ్చాక నిపుణుల కమిటీ, మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు
- బహిర్గతంకాని నివేదికలు
- మూడేళ్ల క్రితం మూతపడిన తాండవ, ఏటికొప్పాక ఫ్యాక్టరీలు
- అగమ్యగోచరంగా గోవాడ షుగర్స్ భవిష్యత్తు
- సర్కారు తీరుపై కార్మికులు, రైతుల మండిపాటు



తాండవ షుగర్ ఫ్యాక్టరీ



గోవాడ షుగర్ ఫ్యాక్టరీ



ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీ

చోడవరం, ఏప్రిల్ 28:

'మేం అధికారంలోకి వస్తే జిల్లాలోని సహకార షుగర్ ఫ్యాక్టరీలన్నింటికీ మంచి రోజులు వచ్చినట్టే. గోవాడ షుగర్ ఫ్యాక్టరీని రూ.వంద కోట్లతో అభివృద్ధి చేస్తాం'... ఇదీ ఐదేళ్ల క్రితం పాదయాత్ర సందర్భంగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జిల్లాలోని షుగర్ ఫ్యాక్టరీల కార్మికులు, రైతులకు ఇచ్చిన హామీ.

అభివృద్ధి మాట దేవుడెరుగు.. వైసీపీ అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తరువాత అప్పటికే నడుస్తున్న మూడు షుగర్ ఫ్యాక్టరీలలో తాండవ, ఏటికొప్పాక ఫ్యాక్టరీలు మూతపడగా, గోవాడ షుగర్ ఫ్యాక్టరీ అతి కష్టమ్మీద నడుస్తోంది. ఇది కూడా నేడో, రేపో మూతపడే స్థితికి వచ్చింది. షుగర్ ఫ్యాక్టరీలు మూతపడుతుంటే వైసీపీ ప్రభుత్వం ఆదుకునేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని కార్మికులు, రైతులు మండిపడుతున్నారు.

జిల్లాలోని సహకార షుగర్ ఫ్యాక్టరీలను ఆదుకుంటామని, అభివృద్ధి చేస్తామని ఐదేళ్ల క్రితం పాదయాత్ర సమయంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హామీ ఇవ్వడంతో కార్మికులు, రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సహకార షుగర్ ఫ్యాక్టరీలను అభివృద్ధి బాటలో నడిపించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలంటూ ప్రత్యేకంగా నిపుణుల కమిటీని అన్ని ఫ్యాక్టరీలకు పంపించింది. ఈ నిపుణుల కమిటీ అన్ని ఫ్యాక్టరీలను సందర్శించి వాటిపై ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్టు సమాచారం. అనంతరం ఫ్యాక్టరీలపై ప్రత్యేకంగా సీనియర్ మంత్రి బొత్స సత్యనారాయణ, అప్పటి వ్యవసాయశాఖా మంత్రి కన్నబాబు, నాటి పరిశ్రమల శాఖా మంత్రి మేకపాటిలతో కూడిన మంత్రివర్గ ఉపసంఘాన్ని కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటుతో షుగర్ ఫ్యాక్టరీలకు మహర్దశ పట్టనుందని, అప్పటికే మూతపడిన తుమ్మపాల ఫ్యాక్టరీ కూడా తిరిగి తెరుచుకుంటుందని రైతులు, కార్మికులు ఆశించారు. అయితే నిపుణుల కమిటీ, మంత్రి వర్గ ఉపసంఘం సందర్శనలు పూర్తయిన తరువాత ఫ్యాక్టరీల పరిస్థితిలో ఏమాత్రం మార్పులేకపోగా, వైసీపీ అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తరువాత నడుస్తున్న మూడు షుగర్ ఫ్యాక్టరీలలో తాండవ, ఆ తరువాత ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. ఇక మిగిలిన గోవాడ ఫ్యాక్టరీ కూడా మూడేళ్లుగా ముక్కుతూ ... మిగతా 8వ పేజీలో

నేడు చోడవరంలో సీఎం జగన్ సభ



అనకాపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం జగన్మోహన్‌రెడ్డి సోమవారం చోడవరం రానున్నారు. గన్నవరం నుంచి విమానంలో బయలుదేరి విశాఖపట్నం విమానాశ్రయానికి ఉదయం 10 గంటలకు చేరుకుంటారు. అక్కడ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి 10.30 గంటలకు చోడవరం వస్తారు. 11.55 గంటల వరకు చోడవరంలో జరిగే ఎన్నికల ప్రచార సభలో పాల్గొని ప్రసంగిస్తారు. అనంతరం హెలికాప్టర్‌లో కోనసీమ జిల్లాకు వెళ్లనున్నారు.

గ్రోయిన్ల నిర్వహణ గాలికి..

వైసీపీ అధికారంలోకి వచ్చాక సాగునీటి వనరులపై నిర్లక్ష్యం

- జిల్లాలో చాలా చోట్ల గ్రోయిన్లు శిథిలావస్థకు చేరినా పట్టించుకోని వైనం
- మరమ్మతులకు ఒక్క పైసా విడుదల చేయలేదు
- సాగునీరు అందక నష్టపోతున్నామని రైతుల గగ్గోలు



అనకాపల్లి మండలం తగరంపూడి శారదా నది గ్రోయిన్ పరిస్థితి ఇలా..

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో గ్రోయిన్ల నిర్వహణను వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసింది. అధికారం చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు గ్రోయిన్ల మరమ్మతులకు ఒక్క పైసా కూడా విడుదల చేయలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. జిల్లాలో చాలా చోట్ల గ్రోయిన్లు శిథిలావస్థకు చేరి సాగునీరు వృథా అవుతోంది. దీని వల్ల పంటలకు నీరు లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అయితే వైసీపీ ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టనట్టే వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

జిల్లాలో అనకాపల్లి, ఎలమంచిలి నియోజకవర్గాల పరిధిలో శారదా నదిపై తగరంపూడి, సీతానగరం, తుమ్మపాల, చెర్లోపల్లి, నాగులాపల్లి, కాశీమదుం, పేరంటాలపాలెం, వెదురుపర్తి, ఉగ్గినపాలెం ప్రాంతాల్లో గ్రోయిన్లు ఉన్నాయి. వీటి కింద అనకాపల్లి, కశింకోట, మునగపాక మండలాల పరిధిలో సుమారు 9 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. కశింకోట మండలంలో కాశీమదుం గ్రోయిన్, పేరంటాలపాలెం, వెదురుపర్తి, ఉగ్గినపాలెం గ్రోయిన్లు, అనకాపల్లి మండలం బవులువాడ, దిబ్బపాలెం, పంచాయతీల పరిధిలోని సీతానగరం గ్రోయిన్లకు వైసీపీ అధికారం చేపట్టిన తరువాత నుంచి ఇప్పటి వరకు ఒక్క పైసా విడల్చలేదు. చోడవరం నియోజకవర్గ పరిధిలో శారదా, పద్దేరు నదులపై వడ్డాది, గౌరీపట్నం, బెన్నవోలు, చాకిపల్లి, కలిగొట్ల, మల్లాం ప్రాంతాల్లో గ్రోయిన్ల మరమ్మతులకు నిధులు విడుదల చేయకపోవడంతో సుమారు ఆరు వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందని పరిస్థితి నెలకొంది. అలాగే పంట కాలువలు పూడుకుపోయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. సాగునీరు అందక పంట పొలాలు ఎండిపోతున్నాయని, తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఈ ప్రభుత్వం సాగునీటి వనరులపై నిర్లక్ష్యం చూపిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేటితో ముగియనున్న నామినేషన్ల ఉపసంహరణ గడువు

అనకాపలి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పార్లమెంట్, జిల్లాలోని అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ల ఉపసంహరణ గడువు సోమవారంతో ముగియనున్నది. అనకాపల్లి పార్లమెంట్ స్థానానికి మొత్తం 25 మంది నామినేషన్లు వేయగా, ముగ్గురి నామినేషన్లు తిరస్కరణకు గురైన విషయం తెలిసిందే. అలాగే ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు మొత్తం 90 నామినేషన్లు దాఖలు కాగా, వాటిలో 15 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు నామినేషన్ వేసిన అభ్యర్థులు ఎవరైనా తమ నామినేషన్ ఉపసంహరించుకునేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల్లోగా అభ్యర్థులు స్వయంగా రిటర్నింగ్ అధికారి ముందు హాజరై తమ నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చు.

జన కేతనం

- పొలిటికల్ నర్సరీ... పెందుర్తి!
- గొలుగొండ... ఒకప్పటి లోక్‌సభ నియోజకవర్గ కేంద్రం
- నర్సీపట్నంలో వారసత్వ రాజకీయాలు · 7లో

దర్జాగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు

మండలంలో పలు చోట్ల కొండలను గుల్ల చేస్తున్న అక్రమార్కులు

- జగనన్న లేఅవుట్లనూ వదలని వైనం
- అధికార పార్టీ నేతల అండదండలు ఉండడంతో పట్టించుకోని అధికారులు



గంగవరం జగనన్న కాలనీని ఆనుకొని ఉన్న కొండవాలు ప్రాంతంలో గ్రావెల్ తవ్వేసిన దృశ్యం

సబ్బవరం, ఏప్రిల్ 28:

మండలంలో పలు చోట్ల గ్రావెల్ అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. అక్రమార్కులకు అధికార పార్టీ నేతల అండదండలు ఉండడంతో అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కొండలను పిండి చేసి దర్జాగా గ్రావెల్‌ను తరలించుకుపోతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు.



గాలిభీమవరం సర్వే నంబరు 134లోని ములకలకొండ ప్రాంతంలో గ్రావెల్ తవ్వేసిన దృశ్యం

మండలంలోని రాయపుఅగ్రహారం, గాలి భీమవరం, పైడివాడ అగ్రహారం, అసకపల్లి, సబ్బవరం, వంగలి తదితర ప్రాంతాల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. జీవీఎంసీ 88వ వార్డు పరిధిలోని గంగవరం, నంగినారపాడు గ్రామాల పరిధిలో గల జగనన్న లేఅవుట్లు, వాటిని ఆనుకుని ఉన్న కొండవాలు ప్రాంతాల్లో దర్జాగా అనధికార తవ్వకాలు జరుగుతున్నాయి. ఇంత జరుగుతున్నా వీఎంఆర్డీఏ, రెవెన్యూ, గనుల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. సబ్బవరం మండలానికి ఆనుకొని ఉన్న గాజువాక తలారివానిపాలెంలోని (సర్వే నంబర్లు 155, 156, 141) కొండలు, పరవాడ మండలం ఇ-మర్రిపాలెం, పెదముషిడివాడ గ్రామాల్లో ఉన్న కొండలను కూడా ఆక్రమార్కులు దర్జాగా తవ్వేస్తున్నారు. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గడం వల్లే అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కొనసాగుతున్న ఎండల తీవ్రత



నిర్మానుష్యంగా ఉన్న మాడుగుల ఘాట్‌రోడ్డు జంక్షన్

- రావికమతంలో 44.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

అనకాపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎండల తీవ్రత అధికంగా ఉంది. ఉదయం 9 గంటల నుంచే భానుడు ప్రతాపం చూపుతున్నాడు. ఆదివారం అత్యధికంగా రావికమతంలో 44.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కోటవురట్లలో 43.9, రోలుగుంటలో 43.8, కశింకోట, మాకవరపాలెంలో 43.1, కె.కోటపాడులో 43, నర్సీపట్నంలో 42.9, మాడుగులలో 42.8, బుచ్చెయ్యపేటలో 42.7, చీడికాడలో 42.4, చోడవరంలో 42.4, గొలుగొండలో 42.2, నాతవరంలో 42, దేవరాపల్లిలో 41.5, సబ్బవరంలో 41.1, అనకాపల్లిలో 40.9, మునగపాకలో 39.2, పరవాడలో 39.1, ఎలమంచిలిలో 38.6, ఎస్.రాయవరంలో 38.4, పాయకరావుపేటలో 38.2, అచ్యుతాపురంలో 38, నక్కపల్లిలో 37, రాంబిల్లిలో 35.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాగల 24 గంటల్లో జిల్లాలో ఇదే విధంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలున్నాయని వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

ఉత్సాహంగా మహిళా శంఖారావం



మహిళా శంఖారావం సభలో మాట్లాడుతున్న బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్

కశింకోట మండలంలోని తాళ్ళపాలెం గ్రామంలో ఆదివారం నిర్వహించిన మహిళా శంఖారావం కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. అధిక సంఖ్యలో మహిళలు, కూటమి శ్రేణులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. - వార్త 6వ పేజీలో..

ఎన్నికల నిర్వహణకు పటిష్ఠ బందోబస్తు · 6లో

రాష్ట్ర ఎన్నికల పోలీస్ పరిశీలకుడు దీపక్‌మిశ్రా



తాళ్లపాలెం శంఖారావానికి హాజరైన మహిళలు

కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత

మహిళలకు మరిన్ని పథకాలు

బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్

ఉత్సాహంగా మహిళా శంఖారావం

కశింకోట, ఏప్రిల్ 28 : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళల సంక్షేమానికి మరిన్ని పథకాలు ప్రవేశపెడతామని బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ హామీ ఇచ్చారు. మండలంలోని తాళ్లపాలెంలో ఆదివారం ఏర్పాటు చేసిన శంఖారావం సభలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో మహిళల పాత్ర చాలా ముఖ్యమైనదన్నారు. విజయంలో వారి పాత్ర తక్కువగా అంచనా వేయలేమని తెలిపారు. తాళ్లపాలెం శంఖారావం సభ మహిళలతో హోరెత్తింది. తొలుత తాళ్లపాలెం కూడలి నుంచి ప్రారంభమైన భారీ ర్యాలీలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఈ ర్యాలీలో బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, ఆతని సతీమణి శ్రీదేవి, అసెంబ్లీ అభ్యర్థి కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు, దాడి రత్నాకర్, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు కాయల మురళీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, సీఎం రమేశ్ తనయుడు రిత్విక్ తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ గెస్ట్‌హౌస్‌గా ఐఏఎస్ అధికారి భవనం

» జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపణ



విలేకర్ల సమావేశంలో భవనం ఫొటోను చూపిస్తున్న కార్పొరేటర్ మూర్తియాదవ్

విశాఖపట్నం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) నిధులను అధికారులు తమ అస్మదీయులకు అప్పనంగా పంచి పెడుతున్నారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐఏఎస్ అధికారి పోలా భాస్కర్ భార్య అమరావతి పేరుతో నగరంలోని విశాలాక్షి నగర్‌లో ఐదంతస్థుల భవనం ఉందన్నారు. ఆ భవనానికి జీవీఎంసీ రెవెన్యూ అధికారులు రెసిడెన్షియల్ కేటగిరీలో ఇంటి పన్ను విధించి ఆరు నెలలకు రూ.1,350 చెల్లించాల్సి ఉంటుందని నిర్ణయించారన్నారు. అయితే సదరు ఐఏఎస్ అధికారి...జీవీఎంసీకి చెందిన ఒక అధికారిపై ఒత్తిడి తెచ్చి తన భవనాన్ని జీవీఎంసీ గెస్ట్‌హౌస్‌గా తీసుకునేలా చేశారని ఆరోపించారు. సదరు ఐఏఎస్ అడగడమే తరువాయి అన్నట్టు జీవీఎంసీ అధికారి ఆ భవనానికి నెలకు రూ.20 లక్షలు అద్దెగా చెల్లించేస్తున్నారన్నారు. ఆ భవనంలో జీవీఎంసీ అధికారులు ఎవరూ బస చేయకపోయినా అక్కడ జీవీఎంసీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పది మందిని కేటాయించి నిత్యం పనులు చేయిస్తున్నారు. దీనివల్ల జీవీఎంసీ నిధులు దుబారా అవడమే కాకుండా, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాన్ని సక్రమం చేసినట్టయిందని మూర్తియాదవ్ ఆరోపించారు. జీవీఎంసీకి వచ్చే ప్రముఖులకు నిజంగా వసతి కల్పించాలంటే కిర్లంపూడి లేఅవుట్‌లో రూ.ఆరు కోట్ల వ్యయంతో నిర్మించిన గెస్ట్‌హౌస్‌ను వాడుకోవచ్చునని, అయినా అధికారులు ప్రతి నెలా అప్పనంగా రూ.20 లక్షలు చెల్లించేందుకు ఆసక్తి చూపడం దురదృష్టకరమన్నారు. జీ-20 పేరుతో నగరంలో చేపట్టిన సుందరీకరణ పనులు, పచ్చదనం పెంపు కోసం ఏపీ గ్రీన్ కార్పొరేషన్‌కు జీవీఎంసీ నిధుల నుంచి రూ.10 కోట్లు చెల్లించారని, దీనివెనుక రాష్ట్రస్థాయిలో చక్రం తిప్పుతున్న సీనియర్ ఐఏఎస్ అధికారి పాత్ర ఉందన్నారు. నగర ప్రజల తాగునీటి అవసరాలకు కేటాయించాల్సిన నీటిని భవన నిర్మాణ అవసరాలకు అధికారులు తరలిస్తున్నారని ఆరోపించారు. ఒకవైపు నగర ప్రజలు తాగునీటి కోసం కటకటలాడుతుంటే అధికారులు ఆ విషయాన్ని పట్టించుకోకుండా భవన నిర్మాణానికి శుద్ధిచేసిన నీటిని తరలించడం వెనుక భారీగా డబ్బులు చేతులు మారాయని ఆరోపించారు. ఈ సమావేశంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్, టీడీపీ అధికారప్రతినిధి పోతనరెడ్డి, జనసేన నేత ప్రసాద్, బీజేపీ నాయకుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

మన ప్రభుత్వం ఎలాగూ రాదు..

» మస్తర్ల నమోదు మీ ఇష్టం

» ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లకు వైసీపీ నేతల సూచనలు

పద్మనాభం (రూరల్), ఏప్రిల్ 28: మన ప్రభుత్వం వచ్చే అవకాశాలు ఎక్కడా కనిపించడం లేదు. ఇప్పుడే నాలుగు రాళ్లు వెనకేసుకోండి... ఉపాధి పనుల్లో ఇష్టమొచ్చినన్ని మస్తర్లు రాసుకోండి... మీకు సమస్యలు రాకుండా సంబంధిత టెక్నికల్, ఇతర అధికారులు చూసుకుంటారు..

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను పర్యవేక్షిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు వైసీపీ నాయకులు ఇలా హామీలు ఇస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. పద్మనాభం మండలంలోని పలు గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లకు కొంతమంది వైసీపీ నాయకులు ఈ మేరకు సూచించారని చెబుతున్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చేటట్టు కనిపించడం లేదు. బినామీ పేర్లతో మస్తర్లు రాసుకుని, లబ్ధి పొందాలని చెబుతున్నట్టు సమాచారం. మండలంలో సుమారు 18 పంచాయతీల్లో ఉపాధిహామీ పనులు జరుగుతున్నాయి. వీటిని పర్యవేక్షిస్తున్న వారిలో కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఇష్టమొచ్చినట్టుగా మస్తర్లు రాస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇటీవల కృష్ణాపురం గ్రామంలో ఉపాధి ఏపీఎం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. దీంతో అక్కడ పనిచేస్తున్న కూలీల కంటే సుమారు 50 మంది పేరుతో అదనంగా మస్తర్లు నమోదైనట్టు తేలింది. దీనిపై సంబంధిత సిబ్బందిని నిలదీయగా సరైన సమాధానం రాలేదని తెలిసింది. వైసీపీ నాయకుల సూచనల మేరకే బినామీ పేర్లతో మస్తర్లు రాస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గంగవరం పోర్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

» హెచ్ఆర్ఎఫ్ ప్రతినిధులు రఘు, అనురాధ

విశాఖపట్నం, ఏప్రిల్ 28: అదానీ గంగవరం పోర్టు ఉద్యోగులకు కనీస వేతనంగా చట్ట ప్రకారం నెలకు రూ.30 వేలు ఇవ్వాలని, వారందరినీ పోర్టు ఉద్యోగులుగానే గుర్తించి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని మానవ హక్కుల వేదిక (హెచ్ఆర్ఎఫ్) జిల్లా అధ్యక్షుడు పి.రఘు, ప్రధాన కార్యదర్శి కె.అనురాధ డిమాండ్ చేశారు. పోర్టులో గంగవరం, దిబ్బపాలెం గ్రామాలకు చెందిన సుమారు 550 మంది పని చేస్తున్నారని, వీరందరూ పోర్టు నిర్మాణ సమయంలో ఉపాధి కోసం అనేక పోరాటాలు చేశారని, అందువల్లే వీరికి ఒప్పంద సంస్థ ద్వారా ఉద్యోగాలు వచ్చాయని పేర్కొన్నారు. వీరంతా అన్‌స్కిల్డ్ ఉద్యోగులుగా సెక్యూరిటీ, క్లీనింగ్, లోడింగ్, అన్ లోడింగ్ వంటి విభాగాల్లో పని చేస్తున్నారని, వీరిని పోర్టు యాజమాన్యం ఉద్యోగులుగా గుర్తించకపోవడం శోచనీయమన్నారు. వీరికి చట్ట ప్రకారం వేతనాలు, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు ఇప్పటికైనా పోర్టు యాజమాన్యం ముందుకు రావాలన్నారు. పోర్టు కార్మికుల ఆందోళనలకు హెచ్ఆర్ఎఫ్ మద్దతు ఉంటుందని వారు పేర్కొన్నారు.

టీడీపీ పీఆర్వో గోపాలరెడ్డికి అభినందన

విశాఖపట్నం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా పాల్గొని తెలుగుదేశం పార్టీ గొంతును బలంగా వినిపించిన విశాఖ పార్లమెంటు పార్టీ పీఆర్వో కె.గోపాలరెడ్డిని అధినేత చంద్రబాబునాయుడు అభినందించారు. ఈ మేరకు ఒక లేఖను పంపారు. రాష్ట్రవ్యాప్తంగా సామాజిక మాధ్యమాలను వినియోగించే నాయకులు, కార్య కర్తలకు పార్టీ పాయింట్లు కేటాయించింది. విశాఖ జిల్లాలో గోపాలరెడ్డి ఎక్కువ పాయింట్లు సాధించడంతో అభినందించారు.

నిరుపయోగంగా ఎలమంచిలి సీహెచ్‌సీ భవనం

నాలుగు నెలల క్రితం ప్రారంభం

» అయినా వినియోగంలోకి తీసుకురాని అధికారులు

» శిథిల భవనంలోనే సీహెచ్‌సీ నిర్వహణ

» అసౌకర్యాల నడుమ రోగులకు వైద్య సేవలు



తులసీనగర్‌లో ప్రారంభించిన నూతన ఆస్పత్రి భవనం



పాత ఆస్పత్రిలో దెబ్బతిన్న గది

ఎలమంచిలి, ఏప్రిల్ 28: అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని అన్న చందంగా తయారైంది ఎలమంచిలి సీహెచ్‌సీ దుస్థితి. కోట్లాది రూపాయలతో కొత్త భవనాన్ని నిర్మించినా అది నిరుపయోగంగా ఉంది. పట్టణంలోని తులసీనగర్‌లో రూ.3 కోట్లతో నిర్మించిన సీహెచ్‌సీ భవనాన్ని 4 నెలలు క్రితం ప్రారంభించారు. ప్రస్తుతం సీహెచ్‌సీ నిర్వహిస్తున్న భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన భవనాన్ని నిర్మించారు. అయితే నూతన భవనంలోకి సీహెచ్‌సీని మార్చలేదు. దీంతో శిథిల భవనంలోనే ఆస్పత్రి సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. నూతన ఆస్పత్రి భవనం ప్రారంభానికి నోచుకున్నా సరే తమకు ఈ బాధలు మాత్రం తప్పడం లేదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీహెచ్‌సీకి ప్రతిరోజూ 300 మంది రోగుల వరకూ ఆస్పత్రిలో సేవలు పొందుతారు. జాతీయ రహదారి పరిసర ప్రాంతాల్లో ప్రమాదాలు బారిన పడిన వారంతా సీహెచ్‌సీనే ఆశ్రయిస్తుంటారు. కానీ సీహెచ్‌సీలో అరకొర వసతులు ఉండడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. పాత ఆస్పత్రి భవనంలో విద్యుత్ సరఫరా నిలిచిపోతే చీకటిలోనే దోమలతో రోగులు అవస్థలు పడుతున్నారు. శిథిలావస్థకు చేరిన ఆస్పత్రి భవనంలో వసతి సమస్యతోపాటు పలు సమస్యలు వేధిస్తున్నాయి. తులసీనగర్‌లో నిర్మించిన 40 పడకల సామాజిక ఆస్పత్రి నూతన భవనంలోకి మార్చకపోవడంతో అటు రోగులు, ఇటు వైద్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. నూతన భవనంలో వైద్య సేవలు అందుతాయని సంతసించిన రోగులకు నిరాశే ఎదురవుతోంది. భవనం ప్రారంభించి 4 నెలలు కావస్తున్నా సరే నూతన ఆస్పత్రి భవనంలోకి మార్పు చేయలేదు. నూతన ఆస్పత్రి భవనంలో సీహెచ్‌సీ సేవలు నిర్వహించేందుకు వైద్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నూకాంబిక ఆలయానికి పోటెత్తిన భక్తులు

» అమ్మవారిని దర్శించుకున్న డిప్యూటీ కమిషనర్



మజ్జిగ పంపిణీ చేస్తున్న డీసీ సుజాత



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 28 : ఉత్తరాంధ్రలోనే ప్రఖ్యాతిగాంచిన స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారి జాతర ప్రారంభమైన మూడో ఆదివారం కావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజామున ఆరు గంటలకు అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారి దర్శనానికి తెల్లవారుజామున ఐదు గంటల నుంచే భక్తులు క్యూ కట్టారు. ఆలయ ఆవరణలోని క్యూలైన్లు అన్ని నిండిపోవడంతో సాధారణ దర్శనానికి వచ్చిన భక్తులు రోడ్డుపై క్యూ కట్టాల్సి వచ్చింది. ఆలయ ఆవరణతోపాటు పరిసర తోటల్లో భక్తులు వంటలు తయారుచేసి అమ్మవారికి నైవేద్యం పెట్టి భోజనాలు చేశారు. దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ సుజాత బాలాలయంలోని అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే క్యూలైన్‌లను పరిశీలించారు. స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాలను ఆమె ప్రారంభించారు. ఆలయం తరుపున కూడా క్యూలో ఉన్న భక్తులకు చల్లటి తాగునీటిని సిబ్బంది అందజేశారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా సిబ్బంది చర్యలు చేపట్టారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ సీఐ జి.శంకరరావు ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించగా.. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ట్రాఫిక్ సీఐ పి. పైడపునాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

ప్రశాంత ఎన్నికల నిర్వాహణకు పటిష్ఠ బందోబస్తు

» రాష్ట్ర ఎన్నికల పోలీస్ పరిశీలకులు దీపక్‌మిశ్రా



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల పోలీస్ పరిశీలకులు దీపక్‌మిశ్రా

అనకాపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 28: జిల్లాలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అవసరమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల పోలీస్ పరిశీలకులు దీపక్‌మిశ్రా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చిన్న పొరపాటుకు కూడా తావు లేకుండా ప్రశాంత ఎన్నికల నిర్వహణకు పోలీసులు విధులను నిర్వహించాలన్నారు. ఈవీఎంల భద్రత, రవాణా మొదలగునవి అన్ని తప్పకుండా వీడియో తీయాలన్నారు. బూత్‌స్థాయి నుంచి పోలింగ్ నిర్వహణ, ఓట్ల లెక్కింపు వరకు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఎన్నికలు ముగిసే వరకు శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ ముందు రోజు, తర్వాత రోజు మరింత జాగ్రత్తగా విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఈవీఎంల తరలింపు నుంచి మరలా స్ట్రాంగ్ రూముకు వచ్చే వరకు పూర్తి వీడియో తీయాలన్నారు. సమావేశంలో అడిషినల్ డీజీపీ (లా అండ్ ఆర్డర్) డాక్టర్ శంకబ్రత బాగ్చి, విశాఖ రేంజి డీఐజీ విశాల్‌గున్ని, ఎన్నికల పరిశీలకులు దల్జీత్‌సింగ్, డాక్టర్ రాకేష్‌కుమార్, మోహన్ ఎం దహికర్ పాల్గొన్నారు.

దడ పుట్టిస్తున్న మండల పరిషత్ కూడలి

» తరచూ ప్రమాదాలు

» ప్రయాణికులను భయపెడుతున్న జంక్షన్

» వాహనదారులదీ అదే పరిస్థితి

» పట్టించుకోని అధికారులు



ప్రమాదకరంగా దర్శనమిస్తున్న మండల పరిషత్ కూడలి

పరవాడ, ఏప్రిల్ 28: స్థానిక మండల పరిషత్ కూడలి ప్రయాణికుల్లో దడ పుట్టిస్తోంది. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో అటుగా రాకపోకలు సాగించే పాదచారులు, వాహనదారుల్లో గుబులు రేపుతోంది. వాహనాల రద్దీకి తగినట్టు రహదారిని విస్తరించకపోవడం, మలుపుల వద్ద రోడ్డు కోతకు గురికావడం కారణంగా భారీ వాహనాల సైతం బోల్తా పడుతున్నాయి. పరవాడ, లంకెలపాలెం, గాజువాక, అచ్యుతాపురం, ఎన్టీపీసీ, ఫార్మాసిటీ తదితర ప్రాంతాలకు వెళ్లే భారీ వాహనాలతో నిత్యం ఈ కూడలి రద్దీగా కనిపిస్తుంది. దీనికి సమీపంలోనే మండలపరిషత్, తహసీల్దార్, ఎంఈవో, వెలుగు, హౌసింగ్, ఎస్ఆర్ఈజీఎస్, పశువైద్యం, భవిత కేంద్రం, వ్యవసాయ శాఖ కార్యాలయాలు ఉన్నాయి. పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు వివిధ పనుల నిమిత్తం ఈ కార్యాలయాలకు రాకపోకలు సాగిస్తుండంతో నిత్యం రద్దీగా కనిపిస్తుంది. కూడలికి ఆనుకుని దుకాణాలు వెలిశాయి. ఈ దుకాణాలకు సమీపంలోనే వాహనాల రాకపోకల కోసం ప్రయాణికులు నిల్చొంటారు. ప్రమాదకర మలుపు కారణంగా భారీ వాహనాలు అక్కడే బోల్తా పడుతున్నాయి.

గతంలో జరిగిన ప్రమాదాలు ఇలా..



ఇటీవల బోల్తాపడిన కంటైనర్ లారీ (ఫైల్‌ఫొటో)

ఈ ఏడాది జనవరి ఎనిమిదవ తేదీన అచ్యుతాపురం సెజ్ నుంచి లోడుతో విశాఖ పోర్టుకు కంటైనర్ లారీ బయలుదేరింది. సరిగ్గా మండల పరిషత్ కూడలి వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి అప్పటికే స్టాండ్‌లో నిలిపి ఉన్న ఆటోపై బోల్తా పడింది. ఆటోలో ఉన్న డ్రైవర్ బయటకు దూకేయడంతో ప్రమాదం నుంచి బయటపడ్డాడు. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ స్వల్పగాయాలపాలయ్యాడు. అలాగే ఈ సంఘటన జరిగిన కొన్ని రోజులకు ముందు కంటైనర్ లారీ, బూడిద లారీ బోల్తా పడడంతో అందులో ఉన్న డ్రైవర్, క్లీనర్‌లు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఏడాదిన్నర క్రితం లంకెలపాలెం నుంచి అచ్యుతాపురం వైపు వస్తున్న బొగ్గు లారీ కూడలి వద్ద అదుపుతప్పి స్టాండ్‌లో నిలిచి ఉంచిన ఆటోల పైకి దూసుకెళ్లి వేపచెట్టు, హైమాస్ట్, సీసీ కెమెరాల స్తంభాలను బలంగా ఢీకొట్టింది. ఆటోలు నుజ్జు కాగా అందులో ఉన్న వారు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఈ ప్రమాదంలో ఒకరికి కాలు విరిగిపోయింది. ఇదిలా ఉంటే కూడలి వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడంతో వేగంగా వచ్చే వాహనాలు నియంత్రణ కోల్పోతున్నాయి. ఈ క్రమంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు హెచ్చరికల బోర్డులను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నప్పటికీ ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టలేదు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ కూడలి దాటాలంటేనే వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. కోతకు గురైన రహదారి అంచులో స్థానిక మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాలకు ఎదురుగా ఉన్న ప్రధాన రహదారి అంచులు కోతకు గురై ప్రమాదకరంగా దర్శనమిస్తుంది. ఇటీవల కురిసిన వర్షానికి అంచులు వెంబడి ఉన్న మట్టి కొట్టుకుపోయి గుంతలు ఏర్పడడంతోపాటు రాళ్లు తేలాయి. దీంతో అటుగా రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారి కోతకు గురైనప్పటికీ స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు కనీసం మరమ్మతు పనులు చేయించలేకపోయారు. దీంతో ఏ మాత్రం అదుపుతప్పి రోడ్డు కిందకు దిగినా భారీ మూల్యం చెల్లించుకోవాల్సిందే. ఆర్అండ్‌బీ శాఖ అధికారులు స్పందించి కోతకు గురైన రహదారి అంచులు వద్ద మట్టితో పూడ్చడంతోపాటు మండల పరిషత్ కూడలి వద్ద హెచ్చరిక బోర్డులు, స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

క్రైం... crime news

మూడు వేల లీటర్ల బెల్లం పులుసు ధ్వంసం

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 28: మండలంలోని రాజవరం శివారులో ఆదివారం సారా తయారీ స్థావరంపై పోలీసులు దాడి చేసి, మూడు వేల లీటర్ల బెల్లం పులుసును ధ్వంసం చేశారు. ఎస్ఐ జోగారావు అందించిన వివరాలిలా ఉన్నాయి. పక్కా సమాచారంతో మండలంలోని రాజవరం శివారు బీచ్ ప్రాంతంలో ఆదివారం విస్తృత దాడులు చేసి సారా తయారీ స్థావరాన్ని గుర్తించామన్నారు. అక్కడ సారా తయారీ చేస్తున్న కొంతమంది వ్యక్తులు తమను చూసి పారిపోయారని, ఆ ప్రదేశంలో నిల్వ ఉంచిన 3000 లీటర్ల బెల్లం పులుసును గుర్తించి ధ్వంసం చేశామని ఆయన తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధురాలు మృతి



పాయకరావుపేట, ఏప్రిల్ 28 : స్థానిక రాజుగారిబీడు వినాయకుడి గుడి వద్ద ఆదివారం గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందింది. పోలీసులు అందజేసిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక రాజుగారిబీడులోని వినాయకగుడి వద్ద ఉన్న సిమెంట్ బెంచ్‌పై ఆదివారం ఉదయం సుమారు 75 సంవత్సరాల వయస్సు ఉన్న గుర్తు తెలియని వృద్ధురాలు మృతిచెందింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు సిమెంట్ బెంచిపైనే ఉన్న వృద్ధురాలు అనారోగ్యంతో వయసు పైబడినందున ఎండ వేడిమి తట్టుకోలేక మృతిచెందిందని ఆలయ పూజారి కె.శివబాబు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జోగారావు తెలిపారు. మృతదేహాన్ని నక్కపల్లి ఆసుపత్రి మార్చురీకి తరలించామని పోలీసులు తెలిపారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



పాయకరావుపేట, ఏప్రిల్ 28 : స్థానిక నాగరాజుపేట రైల్వే గేటు సమీపంలో శనివారం రైలు నుంచి జారిపడడంతో తీవ్ర గాయాలైన గుర్తు తెలియని వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. తుని ప్రభుత్వ రైల్వే ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శనివారం సుమారు 40 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి ప్రమాదవశాత్తూ జారిపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని తుని ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లేవని, మృతుడి వంటిపై సిమెంట్ రంగుపై తెలుపు, నలుపు చారల ఫుల్ హ్యాండ్స్ చొక్కా, నీలం జీన్స్ ప్యాంటు ఉందని, మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచామన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని తుని ప్రభుత్వ రైల్వే ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. మృతుడి వివరాలు తెలిసినవారు తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన తెలిపారు.

మే డే జయప్రదం చేయండి

» సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి జి. కోటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 28 : ప్రపంచ కార్మిక దినోత్సవం మే డేను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి జి. కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అన్ని మండలాల్లోనూ పతాకావిష్కరణ, కార్మిక ప్రదర్శనలు నిర్వహించనున్నట్టు తెలిపారు. నేటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ కార్మిక హక్కుల్ని హరిస్తున్నాయన్నారు. సమావేశంలో నాయకులు గనిశెట్టి సత్యానారాయణ, వీవీ శ్రీనివాసరావు, రొంగలి రాము, ఎల్. శాంతి, శ్రీను పాల్గొన్నారు.

పెందుర్తిలో రూ.3 లక్షలు పట్టివేత



కారులో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

పెందుర్తి, ఏప్రిల్ 28: పెందుర్తి స్టేషన్ పరిధిలో ఆదివారం పోలీసులు జరిపిన తనిఖీల్లో మూడు లక్షల రూపాయలు పట్టుబడింది. సీఐ ఎల్.రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎన్నికల నేపథ్యంలో మండలంలోని చింతగట్ల వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ కారులో రూ.మూడు లక్షల నగదు లభ్యమైంది. చినముషిడివాడకు చెందిన ఓ వ్యక్తి వివాహ ఖర్చుల నిమిత్తం ఈ నగదును కారులో తీసుకువెళుతుండగా పోలీసుల సోదాల్లో పట్టుబడింది. ఎన్నికల కోడ్ మేరకు రూ.50 వేలకు మించి నగదు ఉండరాదని సీఐ పేర్కొన్నారు.

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు స్వాగతం



నిర్మలా సీతారామన్‌తో బీజేపీ నాయకులు

గోపాలపట్నం, ఏప్రిల్ 28: నగర పర్యటకు విచ్చేసిన కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్‌కు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఢిల్లీ నుంచి ఆదివారం రాత్రి 8.30 గంటలకు ఇక్కడకు చేరుకున్న ఆమెకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎం.రవీంద్ర, ప్రోటోకాల్ కన్వీనర్ బాల రాజేశ్వరరావు, పార్టీ నాయకురాలు సుహాసిని ఆనంద్, తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆమె రోడ్డు మార్గం గుండా హోటల్ నోవాటెల్‌కు చేరుకున్నారు.

ఎన్నికల సిబ్బందికి పారితోషికం

భీమునిపట్నం (రూరల్), ఏప్రిల్ 28 : ఎన్నికల సిబ్బందికి పారితోషికాలు చెల్లించే విధానంపై ఎన్నికల సంఘం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు ప్రిసైడింగ్ అధికారుల శిక్షణా తరగతులకు రోజుకు రూ. 350 చొప్పున చెల్లిస్తారు. భోజనం కోసం అదనంగా రూ. 150 ఇస్తారు. అలాగే పోలింగ్ అధికారి, సహాయ పోలింగ్ అధికారులకు రెండు శిక్షణకు మూడు రోజుల పోలింగ్ విధులకు రోజుకు రూ. 250, భోజనాలకు రోజుకు రూ. 150 చొప్పున అందిస్తారు. మిగిలిన సిబ్బందికి వారు చేసిన విధి నిర్వహణ మేరకు రోజుకు రూ. 200 చొప్పున ఇచ్చి, భోజనాలకు కూడా నగదు చెల్లిస్తారు. ఈమేరకు కలెక్టర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	120.00
లైవ్ ధర	140.00
విత్ స్కిన్	250.00
స్కిన్ లెస్	260.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	400
విజయనగరం	404
శ్రీకాకుళం	404

పెందుర్తి నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు	
మొత్తం ఓటర్లు	3,07,545
పురుషులు	1,52,592
మహిళలు	1,54,948
ఇతరులు	5

దిగ్గజ నేతల పురిటిగెడ్డగా గుర్తింపు

- ఇక్కడి గెలిస్తే... అధికారమే... బలమైన సెంటిమెంట్
- అభ్యర్థులెవరైనా ఒకసారే చాన్స్...
- ఈ ఎన్నికల్లో ఆ ఆనవాయితీకి బ్రేక్
- రెండు జిల్లాల పరిధిలో నియోజకవర్గం
- టీడీపీ, కాంగ్రెస్‌కు నాలుగు సార్లు విజయం
- ఒక్కోసారి గెలిచిన సీపీఐ, పీఆర్పీ, వైసీపీ


పెందుర్తి జంక్షన్

పొలిటికల్ నర్సరీ.... పెందుర్తి!

పొలిటకల్ నర్సరీగా పేర్గాంచి, రాజకీయ దిగ్గజాలను అందించిన పురిటిగడ్డగా పెందుర్తి నియోజకవర్గం చరిత్ర కెక్కింది. పంచాయతీ సర్పంచ్‌లను, గ్రామ కరణాలను చట్టసభలకు పంపించిన అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. 1978లో ఏర్పడిన రెండో అతిపెద్ద నియోజకవర్గంగా ఘనత సాధించింది. గ్రామీణ, పట్టణ సమ్మేళనంతో ఉన్న ఇక్కడి ఓటర్ల తీర్పు ప్రతి ఎన్నికలో విలక్షణమే. అంతేకాదు ఈ నియోజకవర్గంలో ఏపార్టీ అభ్యర్థి విజయం సాధిస్తే రాష్ట్రంలో ఆ పార్టీ అధికారంలోకి వస్తుందన్న బలమైన సెంటిమెంట్ ఉంది. అంతేకాదు అభ్యర్థులెవరైనా ఇక్కడి నుంచి ఒకసారే గెలుపొందుతారని, రెండోసారి కష్టమనే నానుడి ఉంది. అయితే ఈ ఎన్నికల్లో మాత్రం ఆ నానుడికి బ్రేక్ పడనుంది.


ద్రోణంరాజు సత్యనారాయణ | గుడివాడ గురునాథరావు | పెతకంశెట్టి అప్పలనరసింహం


మానం ఆంజనేయులు | బండారు సత్యనారాయణమూర్తి | గణబాబు | తిప్పల గురుమూర్తిరెడ్డి | పంచకర్ల రమేశ్‌బాబు | అదీప్‌రాజు

దిగ్గజనేతలతో పాటు అనామకులనుకున్న వారిని ఈ నియోజకవర్గం అందలమెక్కించిన చరిత్ర సొంతం చేసుకుంది. 2004 ఎన్నికల వరకు విశాలమైన నియోజవర్గంగా నిలిచిన పెందుర్తి ఆ తరువాత జరిగిన నియోజవర్గాల పునర్వ్యవస్థీకరణలో రూపురేఖలు కోల్పోయింది. పార్లమెంటు నియోజవర్గాల వారీగా కొత్త జిల్లాల ఆవిర్భావంతో విశాఖ జిల్లాకే పరమితమైన నియోజకవర్గం అనకాపల్లి జిల్లాలో విలీనమయింది. అయితే పెందుర్తి రెవెన్యూ మండలాన్ని మాత్రం విశాఖ జిల్లాలోనే కొనసాగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో ఈ నియోజవర్గం రెండు జిల్లాల పరిధిలోకి వచ్చింది.

నియోజకవర్గ చరిత్ర...

నియోజకవర్గాల పునర్విభజనకు ముందు గాజువాక గోపాలపట్నం, మధురవాడ, అడివివరం, పోతినమల్లయ్యపాలెం వరకు విస్తరించి, ఉమ్మడి రాష్ట్రంలో రెండో అతిపెద్ద నియోజకవర్గంగా పేర్గాంచింది. పునర్విభజనలో కొత్తగా పశ్చిమ, గాజువాక, నియోజకవర్గాలు ఏర్పడగా కొన్ని ప్రాంతాలు వాటిలో విలీనమయ్యాయి. మరిన్ని ప్రాంతాలు భీమునిపట్నంలో చేరాయి. అప్పటివరకు పరవాడ నియోజకవర్గంలో ఉన్న పరవాడ, సబ్బవరం మండలాలతో పాటు, పెందుర్తి, పెదగంట్యాడ మండలాలను కలుపుతూ పెందుర్తి నియోజకవర్గం ఏర్పడింది. పెందుర్తి మండలంలో 24 పంచాయతీలుండగా పెందుర్తి, చినముషిడివాడ, పురుషోత్తపురం, వేపగుంట, చీమలాపల్లి, లక్ష్మీపురం, పొర్లుపాలెం, నరవ, గవరజగ్గయ్యపాలెం మేజర్ పంచాయతీలు 2006లో గ్రేటర్ విశాఖలో విలీనమై 57, 69, 70, 71, వార్డులుగా రూపాంతరం చెందాయి. దీంతో పాటు 72వ వార్డులో కొన్నిప్రాంతాలు ఇందులోకి వచ్చాయి. ఇక పెందుర్తి మండలంలోని 15 పంచాయతీలు, సబ్బవరం మండలంలో 24 పంచాయతీలు, పరవాడ మండలంలో 16 పంచాయతీలు, పెదగంట్యాడ పరిధిలో కొన్ని గ్రామాలు నియోజకవర్గంలోకి వచ్చి చేరాయి. అనంతరం 2021లో జరిగిన గ్రేటర్ వార్డుల పునర్విభజనలో ఈ వార్డులు 92 నుంచి 96 వరకు వార్డులుగా మారాయి.

రెండు జిల్లాలకు ప్రాతినిధ్యం

జిల్లాల పునర్విభజన తరువాత పెందుర్తి నియోజకవర్గం రెండు జిల్లాలకు ప్రాతినిధ్యం వహిస్తోంది. పెందుర్తి మండలాన్ని విశాఖ జిల్లాలోనూ, పరవాడ, సబ్బవరం మండలాలను అనకాపల్లి జిల్లాలోనూ కలుపుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో పెందుర్తి ఎమ్మెల్యే రెండు జిల్లాల్లో పనిచేయాల్సిన పరిస్థితి నెలకొంది.

గెలిస్తే అధికారమే...

పెందుర్తిలో ఏ పార్టీ అభ్యర్థి గెలిస్తే రాష్ట్రంలో ఆపార్టీ అధికారంలోకి వస్తుందనేది సెంటిమెంట్. అయితే ఈ సెంటిమెంట్‌కు 2009లో బ్రేక్ పడింది. ఆ ఎన్నికల్లో ప్రజారాజ్యం పార్టీ నుంచి ఎమ్మెల్యేగా పంచకర్ల రమేశ్‌బాబు గెలిచినప్పటికీ రాష్ట్రంలో ఆ పార్టీ అధికారంలోకి రాలేదు. ఆ తరువాత జరిగిన రాజకీయ పరిణామాలతో పీఆర్పీ కాంగ్రెస్‌లో విలీనంకావడంతో సెంటిమెంట్ కొనసాగిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

కొత్త రాష్ట్రంలోనూ...

రాష్ట్ర విభజన జరిగిన తరువాతా అదే సెంటిమెంట్ కొనసాగింది. 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పెందుర్తి నుంచి టీడీపీ అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి గెలుపొందారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటయింది. 2019లో వైసీపీ అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ విజయం సాధించగా వైసీపీ అధికారంలోకి వచ్చింది.

ఒకసారే ఛాన్స్‌కు ఈసారి బ్రేక్

పెందుర్తి నుంచి ఏ పార్టీ అభ్యర్థి అయినా ఒకసారి మాత్రమే ఎమ్మెల్యే అవుతారనేది ఇప్పటివరకు కొనసాగుతున్న ఆనవాయితీ. అయితే నాలుగున్నర దశాబ్దాల ఈ రికార్డుకు ప్రస్తుత ఎన్నికల్లో బ్రేక్ పడనున్నది. 1978 నుంచి 2019 వరకు ఇక్కడ పోటీచేసినవారు ఒక్కసారి మాత్రమే ప్రస్తుత వైసీపీ అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్, జనసేన అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు గతంలో పెందుర్తి నుంచి గెలుపొందినవారు కావడంతో ఇద్దరిలో ఎవరు విజయం సాధించినా ఈ ఆనవాయితీకి బ్రేక్ పడినట్టే.

పెందుర్తి ఓటర్లే కీలకం...

పెందుర్తి మండలంలో సుమారు రెండు లక్షల జనాభా ఉంది. తుది ఓటరు జాబితాలో 282 పోలింగ్ కేంద్రాలకు గాను 3,07,545 ఓటర్లు ఉండగా, పురుషులు 1,52,592, మహిళలు 1,54,948, ట్రాన్స్‌జెండర్స్ ఐదుగురున్నారు. కాగా పెందుర్తి మండలంలోనే 1,71,915 మంది ఓటర్లు ఉన్నారు. ఎన్నికల్లో వీరే కీలకం కానున్నారు. వీరంలో పురుషులు 85,670, మహిళలు 86,243 టాన్స్‌జెండర్స్ ఇద్దరున్నారు. కాగా సబ్బవరం మండలంలో 59,548 ఓటర్లకు పురుషులు 29,147మంది, మహిళలు 30,400 మంది, ఒక టాన్స్‌జెండర్ ఉన్నారు. ఇక పరవాడ మండలంలో 64,459 మంది ఓటర్లకు గాను పురుషులు 31,893 మంది, మహిళలు 32,564 మంది, ఇద్దరు టాన్స్‌జెండర్స్ ఉన్నారు, పెదగంట్యాడ మండలంలో 11,623 ఓటర్లు ఉండగా పురుషులు 5,882 మంది, మహిళలు 5741 మంది ఉన్నారు, ఈ మూడు మండలాల మొత్తం ఓటర్లు 1,35,630 కాగా, పెందుర్తి మండలంలోనే అత్యధికంగా 1,71,915 మంది ఉన్నారు.

● పెందుర్తి

గొలుగొండ... ఒకప్పటి లోక్‌సభ నియోజకవర్గం

- నేడు మండల కేంద్రానికే పరిమితం



ఒకప్పటి లోక్‌సభ నియోజకవర్గం కేంద్రం 'గొలుగొండ' ప్రస్తుతం మండల కేంద్రానికే పరిమితమైంది. 1957లో అనకాపల్లి ప్రాంతమంతా గొలుగొండ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఉండేది. 1952లో జరిగిన ఎన్నికల్లో ద్విసభ్య విధానాన్ని అమలు చేయడంతో ఒకరు జనరల్ అభ్యర్థి, మరొకరు రిజర్వు అభ్యర్థిని గొలుగొండ నియోజకవర్గ ప్రజలు ఎన్నుకోవలసి వచ్చింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున మిస్సుల సూర్యనారాయణమూర్తి (జనరల్), అల్లూరి అనుచరుడు కేవీ పడాల్ (మల్లుదొర) (ఎస్టీ రిజర్వేషన్‌పై) గెలుపొందారు. 1957లో నియోజకవర్గాల పునర్విభజనలో ప్రస్తుతం ఉన్న అనకాపల్లి ప్రాంతం గొలుగొండ లోక్‌సభ నియోజకవర్గంలో చేరింది. అనంతరం 1962లో పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజనలో గొలుగొండ స్థానాన్ని రద్దు చేసి, భద్రాచలం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో చేర్చారు. 2003 అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనలో గొలుగొండ మండలాన్ని అనకాపల్లి లోక్‌సభ స్థానంలో చేర్చారు. అలాగే గతంలో గొలుగొండ చింతపల్లి కేంద్రంగా ఉన్న అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఉండేది. 2003లో నర్సీపట్నం సెగ్మెంట్‌లోకి మార్చారు.

నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో విలీనం అయిన అనంతరం 2009లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి బోళెం ముత్యాలపాప, తెలుగుదేశం నుంచి చింతకాయల అయ్యన్నపాత్రుడు పోటీకి దిగారు. ఆ ఎన్నికల్లో తెలుగుదేశానికి ఇక్కడి ఓటర్లు మెజారిటీ ఇచ్చారు. 2014 ఎన్నికల్లో తెలుగుదేశం నుంచి చింతకాయల అయ్యన్నపాత్రుడు, వైసీపీ తరపున పెట్ల ఉమాశంకర్‌గణేష్ పోటీ చేశారు. ఈ మండలంలో వైసీపీ కంటే తెలుగుదేశానికి వెయ్యి మెజారిటీ వచ్చింది. 2019లో జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడుకు 14,243 ఓట్లు, వైసీపీ అభ్యర్థి పెట్ల ఉమాశంకర్‌గణేష్‌కు 18,290 ఓట్లు పడ్డాయి. మండలంలో వైసీపీకి 4,047 మెజారిటీ లభించింది.

● గొలుగొండ

గుర్తుకొస్తున్నారు!

- పాత పరిచయాలు జ్ఞప్తికి తెచుకుంటున్న అభ్యర్థులు
- స్నేహితులు, క్లాస్‌మేట్స్‌తో సంభాషణలు
- ఇప్పటికే పలు వాట్సాప్ గ్రూప్‌ల ఏర్పాటు
- గెట్‌టుగెదర్ పేరిట పార్టీలకు సన్నాహాలు
- ఫోన్ చేసి కుశల ప్రశ్నలు... గెలిపించాలని వేడుకోలు

విశాఖపట్నం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ పోటీలో ఉన్న అభ్యర్థులు ఓట్ల కొల్లగొట్టేందు కు గల అన్ని అవకాశాలను అందిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. నగరంలో తమ పాత స్నేహితులు, పాఠశాల/ కాలేజీలో క్లాస్‌మేట్స్‌తోపాటు సీనియర్లు, జూనియర్లను గుర్తించి, వారితో కలిసిపోయేందుకు తీవ్రంగా యత్నిస్తున్నారు. కొంతమంది వారి ఫోన్ నంబర్లను సేకరించి వాట్సాప్ గ్రూప్‌లను క్రియేట్ చేశారు. అంతేకాదు వారికి స్వయం గా ఫోన్ చేసి యోగక్షేమాలు తెలుసుకోవడంతో పాటు తమకు ఓటేసి గెలిపించాలని కోరుతున్నారు. దీంతో పాటు ఎక్కడికక్కడ రహస్యంగా గెట్‌టుగెదర్‌లు ఏర్పాటుచేసి వారందరినీ ప్రత్యక్షంగా కలిసి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇందులో వైసీపీకి చెందిన అభ్యర్థులు, వారి బంధువులు ఎక్కువగా ఉన్నట్టు సమాచారం. అలాగే ప్రాంతాలు, కులాలవారీగా వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేయడంతో పాటు గుట్టుగా సమావేశాలు నిర్వహించి, ఓట్లు రాబట్టేందుకు ఎత్తులు వేస్తున్నారు.

1978 నుంచి 2019 వరకు పెందుర్తిలో విజేతలు

సంవత్సరం	విజేత	పార్టీ	మెజార్టీ
1978	గుడివాడ అప్పన్న	కాంగ్రెస్	10,047
1980	(ఉపఎన్నిక) ద్రోణంరాజు సత్యనారాయణ	కాంగ్రెస్	
1983	పెతకంశెట్టి అప్పలనరసింహం	టీడీపీ	41,283
1985	ఆళ్ల రామచంద్రరావు	టీడీపీ	9,107
1989	గుడివాడ గురునాథరావు	కాంగ్రెస్	13,093
1994	మానం ఆంజనేయులు	సీపీఐ	30,987
1999	పెతకంశెట్టి గణబాబు	టీడీపీ	23,589
2004	తిప్పల గురుమూర్తిరెడ్డి	కాంగ్రెస్	18,150
2009	పంచకర్ల రమేశ్‌బాబు	ప్రజారాజ్యం	3,272
2014	బండారు సత్యనారాయణమూర్తి	టీడీపీ	18,648
2019	అన్నంరెడ్డి అదీప్‌రాజ్	వైసీపీ	28,860

ప్రచారంలో ఆటవిడుపు

ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్న విశాఖ ఎంపీ అభ్యరి ఎం.శ్రీభరత్, అతని సతీమణి తేజస్విని ఆదివారం ఇలా ఆటవిడుపుగా కనిపించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని సెంట్రల్ పార్కులో ఆదివారం షటిల్ బ్యాడ్మింటన్ ఆడారు. పార్కులో సందర్శకులను, వాకర్స్‌ను కలిసి, ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని కోరారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



ఓటరు మాట



అన్నక్యాంటీన్లు ఏర్పాటు చేయాలి



పేదవారి ఆకలితీర్చేందుకు అన్నక్యాంటీన్లు ఏర్పాటు చేసి భోజనం అందించాలి. సంక్షేమ పథకాలు అర్హులకే అందేలా చర్యలు తీసుకోవాలి. ఇలాంటి ఆలోచనలు ఉన్నవారిని ప్రజలు ఎన్నుకోవాలి. పేదల కడుపుకొట్టే వారితో సమాజానికి ప్రమాదమని గ్రహించాలి.

- రామదాసు గోవిందరావు, అనకాపల్లి

సమర్థులను ఎన్నుకుందాం



సమర్థులైన నేతలతోనే మేలు జరుగుతుంది. ప్రజా సమస్యలను చట్టసభల్లో ప్రస్తావించి, పరిష్కారానికి కృషి చేసే నాయకులు అవసరం. ఇలాంటి అభ్యర్థులను గెలిపించుకోవాలి. ప్రలోభాలకు, తాయిలాలకు లొంగిపోతే మరో ఐదేళ్లు అంధకారమే.

- మంగా మాధవరావు, పెదబయలు

జవాబుదారీతనం అవసరం



ప్రజా ప్రతినిధుల్లో జవాబుదారీ తనం ఉండాలి. సమస్యల పరిష్కారాన్ని బాధ్యత తీసుకోవాలి. ఉచితంగా ఆధునిక వైద్యం అందుబాటులోకి తేవాలి. పర్యావరణ పరిరక్షణకు నడుంకట్టాలి. దీనికి విజన్ ఉన్న నాయకులు అవసరం. ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల్లో ఇలాంటి లక్షణాలు ఉన్నవారిని ఎన్నుకోవాలి.

- అరుణ మైనేని, పర్యావరణవేత్త, మధురవాడ

యువతకు ఉపాధి చూపాలి



యువతకు ఉపాధి కల్పించే ప్రభుత్వాలు కావాలి. పారిశ్రామిక వేత్తలకు రాయితీలు, ప్రోత్సాహకాలు ఇవ్వాలి. ఉచితంగా విద్య, వైద్యం అందాలి. ఇవన్నీ పటిష్టంగా అమలు చేసే ప్రభుత్వం రావాలి. సమర్థులైన నేతలను ఎన్నుకుంటేనే ప్రజా ప్రభుత్వం ఏర్పడుతుంది.

- జి.కన్యాకుమారి, విశ్రాంత ఉపాధ్యాయురాలు, ఎంవీపీకాలనీ

మీరూ పంపించండి

ఎన్నికల వేడి మొదలయ్యింది. పార్టీలు, అభ్యర్థులు సమరాంగణానికి సిద్ధమవుతున్నారు. ఎటువంటి వారు అధికారంలోకి రావాలని మీరు కోరుకుంటున్నారు? పాలకులు ఎలా ఉండాలనుకుం టున్నారు?, ఏం చేయాలని కోరుకుంటున్నారు? ...అభిప్రాయం ఏదైనా మీ మనసులో మాట మాతో పంచుకోండి. దాన్ని 'ఆంధ్రజ్యోతి' పాఠకుల ముందుంచుతాం. ఇంకెందుకు ఆలస్యం మీ అభిప్రాయాన్ని, ఫోటోతో సహా ఈ నంబరుకు వాట్సాప్ చేయండి.

వాట్సాప్ నంబర్ ... 9848212243

మీకు తెలుసా!

టెండర్ ఓటు...



ఎన్నికల సమయంలో ఎక్కువగా వినిపించే పదం టెండర్ ఓటు దీనినే ఛాలెంజ్ ఓటు అని కూడా అంటారు. వీటి గురించి తెలుసుకుందాం. దొంగ ఓటు లేక ఇతర కారణాలతో ఓటు హక్కు కోల్పోయే పరిస్థితి ఎదురైతే తిరిగి దానిని పొందేందుకు భారత ఎన్నికల సంఘం 1061లో తీసుకొచ్చిన సెక్షన్ 49(పి) అవకాశం హక్కును కల్పిస్తోంది. దీని ద్వారా ఓటు పొందాలనుకునే వారు ముందుగా ప్రిసైడింగ్/ ఎన్నికల అధికారిని కలవాలి. ఓటు కోల్పోయిన వ్యక్తి తానేనని నిరూపించుకోవాలి. దీని కోసం ఓటరు కార్డు, ఇతర గుర్తింపు పత్రాలను సమర్పించాలి. ఎన్ఆర్ఐలు అయితే పాస్‌పోర్టు చూపించాలి. ప్రిసైడింగ్/ఎన్నికల అధికారి ఇచ్చే ఫామ్ 17(బీ) పూర్తిచేసి టెండర్ బ్యాలెట్ పొందాలి. ప్రత్యేక కవరులో ఈ ఓటును భద్రపరిచి కౌంటింగ్ కేంద్రానికి పంపిస్తారు. సెక్షన్ 49(పీ) ద్వారా పొందే ఓటు హక్కును టెండర్/ఛాలెంజ్ ఓటు అంటారు.

ఈవీఎం అంటే...



ఈవీఎం అంటే ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్. ఓట్లను నమోదు (రికార్డు) చేయడానికి మానవ సహాయంతో ఉపయోగించే ఎలక్ట్రానిక్ పరికరం. బ్యాలెట్ పత్రాలకు ప్రత్యమ్నాయంగా దేశంలో మొదటిసారి 1982లో కేరళ రాష్ట్రంలోని పర్వూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో వీటిని ప్రవేశపెట్టారు.

నర్సీపట్నంలో వారసత్వ రాజకీయాలు

ఏడు దశాబ్దాలుగా ఆ నాలుగు కుటుంబాలదే ఆధిపత్యం

- లచ్చాపాత్రుడు వారసుడిగా అయ్యన్నపాత్రుడు
- కిల్లాడ రామ్మూర్తినాయుడు వారసుడిగా వేచలపు శ్రీరామ్మూర్తి
- బోళెం గోపాత్రుడు వారసురాలిగా ముత్యాలపాప
- రాజాసాగి సూర్యనారాయణ రాజు తరువాత సాగికృష్ణమూర్తిరాజు...

ఏడు దశాబ్దాలుగా నర్సీపట్నం నియోజకవర్గంలో వారసత్వ రాజకీయాలు రాజ్యమేలుతున్నాయి. రాజాసాగి సూర్యనారాయణరాజు రాజకీయ వారసత్వాన్ని కృష్ణమూర్తిరాజు, రుత్తల లచ్చాపాత్రుడు వారసత్వాన్ని ఆయన మనుమడు అయ్యన్నపాత్రుడు, బోళెం గోపాత్రుడు వారసత్వాన్ని ఆయన మనవరాలు ముత్యాలపాప, కిల్లాడ రామ్మూర్తినాయుడు వారసత్వాన్ని ఆయన మనమడు వేచలపు శ్రీరామమూర్తి అందిపుచ్చుకొని శాసనసభలోకి అడుగుపెట్టారు. అయితే 2019 ఎన్నికల్లో తొలిసారి వారసత్వ రాజకీయాలకు తెరదించుతూ పెట్ల ఉమాశంకర్‌గణేశ్ నర్సీపట్నం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు.


రుత్తల లచ్చాపాత్రుడు | చింతకాయల అయ్యన్నపాత్రుడు | కిల్లాడ రామ్మూర్తి నాయుడు | వేచలపు శ్రీరామమ్మూర్తి | రాజాసాగి సూర్యనారాయణరాజు | రాజాసాగి కృష్ణమూర్తిరాజు | బోళెం గోపాత్రుడు | బోళెం ముత్యాలపాప

- నర్సీపట్నం, పాయకరావుపేట ద్విసభ్య నియోజకవర్గంగా ఉన్నప్పుడు 1952 సంవత్సరంలో నర్సీపట్నం నుంచి కిల్లాడ రామ్మూర్తినాయుడు, పాయకరావుపేట నుంచి రాజాసాగి సూర్యనారాయణరాజు పోటీ చేసి ఎమ్మెల్యేలుగా శాసనసభలోకి ఒకేసారి అడుగుపెట్టారు.
- రాజాసాగి సూర్యనారాయణరాజు తర్వాత తంగేడు రాజుల కుటుంబంలో రాజాసాగి కృష్ణమూర్తిరాజు మూడుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి 1989లో ఒకసారి విజయం సాధించారు. అదే తంగేడు రాజుల కుటుంబానికి చెందిన రాజాసాగి రామచంద్రరాజు రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎ[illegible] చేశారు.
- 1952లో ఎమ్మెల్యేగా చేసిన కిల్లాడ రామ్మూర్తినాయుడు మనమడు (కుమార్తె కొడుకు) వేచలపు శ్రీరామ్మూర్తి 1985, 1996లో రెండుసార్లు పోటీ చేసి ఒకసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. తాత కిల్లాడ రామ్మూర్తినాయుడు ఎమ్మెల్యేగా చేసినందున తాను కూడా ఎమ్మెల్యేగా ఎన్నికవ్వాలని వేచలపు శ్రీరామ్మూర్తికి బలమైన కోర్కె ఉండేదట. 1996లో జరిగిన పార్లమెం టు ఎన్నికలలో పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు చింతకాయల అయ్యన్నపాత్రుడు అనకాపల్లి ఎంపీగా పోటీ చేయాల్సి వచ్చింది. ఎమ్మెల్యే స్థానానికి ఆయన రాజీనామా చేసి అనకాపల్లి ఎంపీగా పోటీ చేశారు. అప్పటివరకు కాంగ్రెస్ పార్టీలో ఉన్న వేచలపు శ్రీరామ్మూర్తిని టీడీపీలో చేర్చుకొని నర్సీపట్నం ఎమ్మెల్యేగా పోటీ చేయించగా, ఆయన గెలుపొందారు.
- ఏకసభ్య నియోజకవర్గంగా నర్సీపట్నం ఆవిర్భవించిన తర్వాత 1962 సంవత్సరంలో తొలిసారి జరిగిన శాసనసభ ఎన్నికలలో స్వతంత్ర పార్టీ అభ్యర్థిగా రుత్తల లచ్చాపాత్రుడు..కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన రాజాసాగి సూర్యనారాయణరాజుపై విజయం సాధించారు. ఆయన మనమడు చింతకాయల అయ్యన్నపాత్రుడు 1983లో టీడీపీలో చేరి ఎమ్మెల్యేగా పోటీ చేసి తంగేడు రాజుల కుటుంబానికి చెందిన రాజా సాగి రామచంద్రరాజుపై విజయం సాధించారు. తర్వాత అయ్యన్నపాత్రుడు ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా ఎన్నికయ్యారు. పలు మార్లు మంత్రిగా పని చేశారు. తాజాగా జరుగుతున్న ఎన్నికలలో పదోసారి అయ్యన్న పాత్రుడు పోటీ చేస్తున్నారు.
- 1977లో నర్సీపట్నం ఎమ్మెల్యేగా చేసిన బోళెం గోపాత్రుడు మనవరాలు బోళెం ముత్యాలపాప 2009లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. నియోజకవర్గం నుంచి తొలి మహిళా ఎమ్మెల్యేగా అసెంబ్లీలోకి అడుగు పెట్టారు.

● నర్సీపట్నం

'వైసీపీ మేనిఫెస్టోలో దళితులకు తీవ్ర అన్యాయం'

పరవాడ, ఏప్రిల్ 28 : వైసీపీ ఎన్నికల మేనిఫెస్టో చూస్తే దళితులపై జగన్ కపట ప్రేమ బయటపడిందని జాతీయ దళిత హక్కుల పోరాట కమిటీ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు ఈరుగుల లక్ష్మీప్రసాద్ ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పెద్ద పీట వేస్తున్నామని గొప్పలు చెప్పుకునే వైసీపీ ప్రభుత్వం సీఎం ప్రకటించిన మేనిఫెస్టోలో ఎస్సీ, ఎస్టీలకు చోటే లేదన్నారు. నా ఎస్సీ.. నా ఎస్టీ.. అనే మాట్లాడే నైతిక హక్కు సీఎం జగన్‌కు, వైసీపీ ప్రభుత్వానికి లేదన్నారు. మేనిఫెస్టోలో దళితులకు ఒక్క పథకం కూడా పొందుపరచకపోవడం దురదృష్టకరమన్నారు. ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ రుణ సదుపాయాలను శాశ్వతంగా సమాధి కట్టిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

జిల్లా స్థాయి గుర్రపు స్వారీ పోటీలు రేపు

పరవాడ, ఏప్రిల్ 28 : మండలంలోని పెదముషిడివాడలో పైడిమాంబ అమ్మవారి ఉత్సవాలు సందర్భంగా ఈనెల 30న జిల్లా స్థాయి గుర్రపుస్వారీ ప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి వరుసగా రూ. 20వేలు, రూ.15వేలు, రూ.12వేలు, రూ.10వేలు, రూ.ఎనిమిది వేలు, రూ. ఆరు వేలు చొప్పున నగదు బహుమతులతోపాటు జ్ఞాపికలను అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే వారు కమిటీ నిర్వాహకులను సంప్రదించాలని కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పరవాడ, ఏప్రిల్ 28 : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం పదిన్నర గంటలకు మండల పరిషత్ కార్యాలయం సమావేశమందిరంలో నిర్వహించనున్నట్టు ఏవో రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లతోపాటు అన్ని శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు.

నేడు గవరపాలెంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లి రూరల్, ఏప్రిల్ 28 : పట్టణంలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాజశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గవరపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని సంతబయలు ప్రాంతం, పెద్ద నుయ్యి, రచ్చరాళ్ల ప్రాంతం, చినరామస్వామి ఆలయ ప్రాంతం, ఎన్టీఆర్ కాలనీ, కర్రివారి వీధి, దాసరిగెడ్డ రోడ్డు, పెదరామస్వామి ఆలయ ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్‌వైర్ల పై వేలాడుతున్న చెట్లకొమ్మలను తొలగించేందుకు ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఆయన తెలిపారు.

నేడు తాళ్లపాలెం సెక్షన్ పరిధిలో..

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం సెక్షన్ పరిధిలో 11కేవీ కన్నూరుపాలెం సబ్ స్టేషన్ ఫీడర్ పనుల కారణంగా సోమవారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ రామకృష్ణ తెలిపారు. కన్నూరుపాలెం, తీడ, చెరకాం, సుందరయ్యపేట, జి.భీమవరం, అచ్చెర్ల, మోసయ్యపేట గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆయన చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పేదల సంక్షేమమే సీఎం లక్ష్యం: వైసీపీ

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 28: పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని వైసీపీ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్, ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి మాట్లాడారు. 2019లో కూడా పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని నవరత్నాలను మేనిఫెస్టోలో ప్రకటించి అమలు చేశారన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చి వాటికి కొన్ని పథకాలను జోడించి మేనిఫెస్టోను సీఎం విడుదల చేశారన్నారు. ఈ సందర్భంగా వైసీపీ మేనిఫెస్టో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

మలేషియాలో ఉగాది సంబరాలు

కొత్తూరు, ఏప్రిల్ 28: మలేషియాలో ఉన్న స్రంబాన్ ప్రాంతంలో ఉగాది సంబరాలు ఘనంగా జరిగాయి. అక్కడ స్థిరపడిన తెలుగువారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సంబరాల్లో విద్యార్థులకు భరతనాట్యం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచి బహుమతులు పొందారు. కార్యక్రమంలో మలేషియా దేశ తెలుగు సంఘం అధ్యక్షుడు డాక్టర్ వెంకట ప్రతాప్, స్రంబాన్ ప్రాంతవాసులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థికి సత్కారం

సబ్బవరం, ఏప్రిల్ 28 : మండలంలోని అమృతపురంలో నిరుపేద దళిత కుటుంబానికి చెందిన అయినంటి దిలీప్ పదో తరగతిలో 572/600 మార్కులు సాధించాడు. ఈసందర్భంగా గణేశ్‌ను ఎంఆర్‌పీఎస్ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు స్వామాట్ కుమార్ ఆదివారం అభినందించి, ఘనంగా సత్కరించారు. దిలీప్ ఉన్నత విద్యకు తన వంతు సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో దిలీప్ తల్లిదండ్రులు గణేశ్, మణి, కృపారావు, సన్యాసి పెద్దిరాజు, దేముడుబాబు, కుమారి, రమణమ్మ, నూకరత్నం, లావణ్య తదితరుల పాల్గొన్నారు.

ఆదరిస్తే.. అభివృద్ధి చేస్తాం

▸▸ సీఎం రమేష్ సతీమణి శ్రీదేవి వినతి



ఆర్యవైశ్య కుటుంబాల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న శ్రీదేవి

చోడవరం, ఏప్రిల్ 28: ఆర్యవైశ్యులకు అన్నివేళలా అండగా ఉం టామని. జిల్లా అభివృద్ధి చెందాలంటే అనకాపల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా సీఎం రమేష్‌కు అవకాశం ఇవ్వాలని సీఎం రమేష్ భార్య శ్రీదేవి హామీ ఇచ్చారు. ఆదివారం పట్టణంలోని కల్యాణ మండపంలో ఆర్య వైశ్య కుటుంబాల ఆత్మీయకలయిక కార్యక్రమానికి ఆమె హాజరయ్యా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కూటమి అభ్యర్థి సీఎం రమేష్‌తో పాటు, టీడీపీ అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజులను గెలిపిస్తే చోడవరం ప్రాంతం అభివృద్ధికి చొరవ తీసుకుంటారని స్పష్టం చేశారు. వైసీపీ నేతల మాదిరిగా వ్యాపారులకు ఎలాంటి వేధింపులు ఉండవని, వారు స్వేచ్ఛగా తమ వ్యాపారాలు చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాజు, తన పదవీకాలంలో చేసిన ప్రగతిని వివరించారు.

సుందరపు విజయానికి సకుటుంబ సమేతంగా ప్రచారం

▸▸ మునిసిపాలిటీలో ఇంటింటికి తోడికోడళ్లు



ఎలమంచిలి కాకివాని వీధిలో ప్రచారం చేస్తున్న ముగ్గురు తోడికోడళ్లు

ఎలమంచిలి, ఏప్రిల్ 28: కూటమి అభ్యర్థుల విజయం కోరుతూ ముగ్గురు తోడికోడళ్లు పట్టణంలో ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. ఎలమంచిలి జనసేన అభ్యర్థి సుందరపు విజయకుమార్ గెలుపు కోసం ఆయన సతీమణి శైలజ, వదిన దమయంతి, తమ్ముని భార్య నందిని కూటమి నేతలు, కార్యకర్తలతో కలిసి సకుటుంబ సమేతంగా ప్రచారం చేస్తున్నారు. ఆదివారం పట్టణంలోని ధర్మవరం, కాకివానివీధి ప్రాంతాల్లో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ముందుగా శ్రీకృష్ణుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం వీరంతా ప్రచారం చేశారు. సుందరపు విజయకుమార్‌కు గాజుగ్లాస్ గుర్తుపైన, బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం.రమేశ్‌కు కమలం గుర్తుపైన ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. ముగ్గురు తోడికోడళ్లు చేస్తున్న ప్రచారానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తుండడం విశేషం. ఈ ప్రచారంలో కూటమి పార్టీల నేతలు కొఠారు సాంబ, గొర్లె నానాజీ, బొద్దపు శ్రీను(రమణ), పల్లా సత్యనారాయణ, నక్కా శివశంకర్, చిరంజీవి, పప్పు ఈశ్వరరావు, గొర్లె బాబూరావు, మహిళలు పాల్గొన్నారు. అదేవిధంగా సుందరపు విజయకుమార్ శనివారం రాత్రి మునిసిపాలిటీ పెదపల్లిలో చేపట్టిన ఎన్నికల ప్రచారానికి విశేష స్పందన లభించింది. స్థానిక నేతలు బొద్దపు శ్రీను, నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామానికి చేరుకున్న సుందరపు విజయ్‌కుమార్, టీడీపీ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావులకు ఘన స్వాగతం పలికారు.

పాయకరావుపేట సమస్యల పరిష్కారానికి కృషి

▸▸ టీడీపీ అభ్యర్థిని వంగలపూడి అనిత



పాయకరావుపేటలో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే వి.అనిత

పాయకరావుపేట, ఏప్రిల్ 28 : నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని పాయకరావుపేట టీడీపీ అభ్యర్థిని వంగలపూడి అనిత అన్నారు. ఆదివారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో స్థానిక నాగరాజుపేట, కడిమివారివీధి, ముస్లింవీధి, చేపలు, కూరగాయల మార్కెట్ ప్రాంతాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించి, ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, అనకాపల్లి ఎంపీగా పోటీచేస్తున్న సీఎం.రమేశ్‌ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం వచ్చిన వెంటనే పాయకరావుపేట నియోజకవర్గం సమస్యలు పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్, టీడీపీ నాయకులు పెదిరెడ్డి చిట్టిబాబు, పెదిరెడ్డి శ్రీను, గొర్రెల రాజబాబు, మజ్జూరి నారాయణరావు, గూటూరు శ్రీనివాసరావు, పల్లా విలియంకేరి, ఎం.రమాకుమారి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలి

పాయకరావుపేట రూరల్ : రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని వంగలపూడి అనిత అన్నారు. ఆదివారం మండలంలోని ఈదటం, ఎస్.నర్సాపురం, పీఎల్.పురంల్లో ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన, ఎమ్మెల్యే ఓటు తనకు సైకిల్ గుర్తుపైన వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, ఎంపీటీసీ సభ్యురాలు గణసాల పద్మ, జనసేన, టీడీపీ నాయకులు ఎగదాసు నానాజీ, గూటూరు శ్రీనివాసరావు, గొర్రెల రాజుబాబు, మజ్జూరి నారాయణరావు, యాళ్ల వరహాలు, చింతకాయల రాంబాబు, పల్లా విలియంకేరీ పాల్గొన్నారు.

జగన్ పాలనలో జనరేషన్ నిర్వీర్యం

నక్కపల్లి: జగన్ ఐదేళ్ల పాలనలో ఒక జనరేషన్‌ను నిర్వీర్యం చేశారని టీడీపీ పాయకరావుపేట అభ్యర్థిని వంగలపూడి అనిత అన్నారు. ఆదివారం నక్కపల్లికి సమీపంలో తన నివాసం వద్ద నియోజకవర్గ ఐటీడీపీ, తెలుగు యువత, ఐటీడీపీ, టీఎన్ఎస్ఎఫ్ విభాగాల సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. యువతకు, విద్యార్థులకు ఎటువంటి నష్టం జరిగిందో ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత తెలుగు యువత, ఐటీడీపీ, టీఎన్ఎస్ఎఫ్ విభాగాలకు వుందన్నారు. కార్యక్రమంలో చించలపు పద్దు, గుర్రం రామకృష్ణ, భీమరశెట్టి శ్రీనివాస్, పెద్దిరెడ్డి పండు, ప్రగడ వీరబాబు, రమేశ్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ఏర్పాటు ఖాయం

▸▸ బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రమేశ్

పెందుర్తి, ఏప్రిల్ 28: త్వరలో జరగనున్న ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని, జగన్ సర్కారు ఇంటికి పోవడం తథ్యమని బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ అన్నారు. ఆదివారం పెందుర్తి సమీపంలోని సింహపురి కాలనీవాసుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాన్ని నాశనం చేసిన వైసీపీకి ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించారు. వైసీపీకి ఓటు వేసి ఎవరూ వృథా చేసుకోరాదన్నారు. మోదీ, చంద్రబాబు, పవన్‌ల త్రిమూర్తులకు పట్టం కడితే ఏపీ హ్యాపీగా ఉంటుందన్నారు. తనను ఎంపీగా గెలిపిస్తే ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం ఇస్తానని హామీ ఇచ్చారు. ఎంపీగా తనకు కమలం గుర్తుపై, పెందుర్తిగా ఎమ్మెల్యేగా జనసేన అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబుకు గాజు గ్లాసు గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. పంచకర్ల మాట్లాడుతూ జగన్‌కు ఓటమి భయం పట్టుకుందని వైసీపీ మేనిఫెస్టో చూస్తేనే అర్థమవుతుందన్నారు. ముందుగా కాలనీవాసులు సీఎం రమేశ్‌ను ఘనంగా సత్కరించి, సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ పెందుర్తి ఇన్‌చార్జి గండి బాబ్జీ, నాయకులు పీలా శ్రీనివాసరావు, సేనాపతి వసంత, మాధవ్, సీఎం రమేశ్ సోదరుడు శ్రీనివాసులనాయుడు పాల్గొన్నారు,

97వ వార్డులో పంచకర్ల విస్తృత ప్రచారం

జనసేన పార్టీ 'పెందుర్తి' అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు 97వ వార్డులోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. సుజాతనగర్, గిరిప్రసాద్‌నగర్, వెంకటాద్రినగర్, సీ2 జోన్, సంపత్ రెసిడెన్సీ చినముషిడివాడ, పాత ఊరు ప్రాంతాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడంతో పాటు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేపట్టే ప్రజా సంక్షేమం, అభివృద్ధి పనులను వివరించారు. చినముషిడివాడలో కూటమి నేతలు భారీ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సేనాపతి వసంత శంకరరావు, జనసేన వార్డు అధ్యక్షుడు సేనాపతి సోమశేఖర్‌నాయుడు, అయిత సింహాచలం, వంశీకృష్ణ, రెడ్డి నారాయణరావు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన జడ్.చింతువా ఎంపీటీసీ దంపతులు



జనసేనలో చేరిన జడ్ చింతువా పంచాయతీ ఎంపీటీసీ దంపతులు

రాంబిల్లి, ఏప్రిల్ 28 : మండలంలోని జడ్.చింతువా ఎంపీటీసీ సభ్యురాలు చేపల భోగిలక్ష్మి, భర్త వెంకటరమణ, అనుచరులు ఆదివారం వైసీపీ నుంచి జనసేన పార్టీలో చేరారు. అచ్యుతాపురంలోని జనసేన పార్టీ కార్యాలయంలో వీరికి ఎలమంచిలి జనసేన అభ్యర్థి సుందరపు విజయకుమార్ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ దంపతులు భాగ్యలక్ష్మి, రమణ మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి సుందరపు విజయకుమార్, సీఎం రమేశ్‌ల గెలుపునకు పూర్తిస్థాయిలో కష్టపడతామన్నారు. జనసేన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయకుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పప్పల నూకన్నదొర, నాయకులు డీఎస్ఎన్.రాజు(బుజ్జి), గనగళ్ళ వివేక్, కలిదిండి రఘురాజు, గిరి, మహిళలు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన దిమిలి వైసీపీ శ్రేణులు

దిమిలి ఎంపీటీసీ సభ్యురాలు కోటాపు లక్ష్మి, మాజీ సర్పంచ్ కోటాపు వడ్డీకాసులు ఆధ్వర్యంలో పంచాయతీలోని వైసీపీ నేతలు మామిడి గణేష్, కరణం సత్యప్రసాద్, యర్రంశెట్టి వెంకి, బండారు బాబ్జీ, ఎస్.రామతేజ, జి.గణేష్, బొద్దపు చిన్ని, ఎస్.రాజు తదితరులు జనసేన పార్టీలో ఆదివారం చేరారు. జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్ వీరందరికీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

ఎలమంచిలిలో కొళాయిలకు ట్యాపులు కరువు

▸▸ వృథాగా పోతున్న తాగునీరు

ఎలమంచిలి, ఏప్రిల్ 28: మునిసిపాలిటీలో పలుచోట్ల తాగునీటికి జనం ఇబ్బందులు పడుతుంటే మరి కొన్నిచోట్ల కొళాయిలకు ట్యాపులు లేక తాగునీరు వృథాగా పోతున్నది. అసలే వేసవి రోజులు.. ఆపై తాగునీటి సమస్య జటిలంగా ఉన్న సమయంలో కూడా అధికారులు నీటి వృథాకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకోకపోవడం పట్ల పట్టణ ప్రజలు మండిపడుతున్నారు. వార్డుల్లో అధిక శాతం వార్డుల్లో కొళాయిలకు ట్యాప్‌లు లేవు. అయినా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా వందలాది లీటర్ల తాగునీరు వృథాగా డ్రైనేజీల పాలవుతోంది. కొన్ని వార్డుల్లో స్థానికులు తాగునీటి కొళాయి వస్తుందో? లేదో? పరిశీలించేందుకు రాత్రి సమయాల్లో కొళాయి ట్యాపులను ఓపెన్ చేస్తున్నారు. ఉదయాన్నే కొళాయి వచ్చినప్పుడు నీరు వస్తుందని తెలిసి నీటి పట్టుకునేందుకు చేరుకుంటున్నారు. వీరు వచ్చినప్పటికీ చాలా నీరు వృథాగా పోతున్నది. మునిసిపల్ అధికారులు నీటి వృథాను అరికట్టేందుకు కొళాయిలకు ట్యాపులను బిగించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.



తులసీనగర్‌లో ట్యాప్‌లేకుండా ఉన్న కొళాయి

షుగర్ ఫ్యాక్టరీల అభివృద్ధి ఉత్తి మాటేనా?

... 5వ పేజీ తరువాయి

మూలుగుతూ నడుస్తున్నది. గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో వంద కోట్ల రూపాయలతో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు కూడా ప్రకటనలకే పరిమితమైంది. ఈ ఫ్యాక్టరీ పరిస్థితి కూడా నేడో, రేపో మూతపడడం ఖాయం అన్న చందంగా దిగజారింది. సహకార షుగర్ ఫ్యాక్టరీలను అభివృద్ధి పథంలో నడిపిస్తామంటూ నాడు జగన్ ఇచ్చిన హామీకి భిన్నంగా జిల్లాలోని సహకార ఫ్యాక్టరీలు మూతపడినప్పటికీ, ప్రభుత్వపరంగా ఎలాంటి చేయూత లభించకపోవడంపై చెరకు రైతులు, కార్మికులు నిరాశ చెందుతున్నారు. అయితే ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ ఏం నివేదిక ఇచ్చిందో, మంత్రివర్గ ఉపసంఘం ఏ రకమైన నిర్ణయాలు తీసుకున్నదో అనే విషయాలు ఇప్పటికీ వెలుగులోకి రాలేదు. సహకార షుగర్ ఫ్యాక్టరీలను లాభాల బాట పట్టిస్తామని నాడు జగన్ హామీ ఇచ్చి ఇప్పుడు ఫ్యాక్టరీలు మూత పడుతున్నా పట్టనట్టు వ్యవహరిస్తున్నారని రైతులు, కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



గోవాడ షుగర్ ఫ్యాక్టరీని నాలుగేళ్ల క్రితం సందర్శించిన నిపుణుల కమిటీ(ఫైల్ ఫొటో)

ధరల మంట

... 5వ పేజీ తరువాయి

ఆయిల్ ధర రూ.72 ఉండగా, ప్రస్తుతం రూ.95 ఉంది. అంటే, కిలోకు 23 రూపాయలు పెరిగింది. గతంలో వేరుశనగ నూనె కిలో రూ.102 ఉండగా, ప్రస్తుతం రూ.160కి చేరింది. పంచదార రూ.22 ఉండగా, ప్రస్తుతం రూ.48కి పెరిగింది. పెసరపప్పు గతంలో కిలో రూ.70 ఉండగా రూ.134కు, కందిపప్పు రూ.94 నుంచి 186కి చేరింది. ఐదేళ్ల కిందట 25 కిలో బియ్యం బస్తా బ్రాండ్‌ను బట్టి రూ.1000 నుంచి రూ.1200 మధ్యలో లభించేది. ప్రస్తుతం రూ.1,400 నుంచి రూ.1,800 మధ్య వెచ్చించాల్సి వస్తోంది. గతంలో మినపగుండ్లు ధర కిలో రూ.78 ఉండగా ప్రస్తుతం 156కు పెరిగింది. వీటితోపాటు అనేక సరకుల ధరలు రెట్టింపు, అంతకంటే ఎక్కువ పెరగడంతో సాధారణ మధ్య తరగతి ప్రజలపై భారం పడుతోంది.

రెట్టింపు అయిన భారం

ధరల పెరుగుదలతో ప్రతి ఇంటిపైనా ఆర్థికంగా భారం రెట్టింపు అయింది. సాధారణ, మధ్య తరగతి కుటుంబాలకు గతంలో నిత్యావసర సరకులకు నెలకు రూ.4 వేల నుంచి ఆరు వేలు ఖర్చయితే, ప్రస్తుతం ఎనిమిది వేల రూపాయల నుంచి రూ.12 వేల వరకు అవుతోంది. సరకులతోపాటు రోజువారీ కొనుగోలు చేసే కూరగాయలు, ఇతరత్రా అన్నింటి ధరలూ పెరిగాయని, మొత్తం నెలకు కనీసం రూ.15 వేలు ఖర్చవుతోందని వెంకోజీపాలెం ప్రాంతానికి నాగమణి అనే గృహిణి పేర్కొన్నారు. ఆదాయంలో పెరుగుదల లేకపోయినా ఖర్చు మాత్రం పెరిగిందని, ప్రభుత్వాలు నిత్యావసర సరకుల ధరలను అదుపులో ఉంచకుండా ప్రజలపై భారాన్ని మోపుతున్నాయని రామకృష్ణ అనే మెకానిక్ ఆవేదన వ్యక్తంచేశాడు. చాలీచాలని సంపాదనతో కుటుంబాన్ని పోషించుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయాడు. ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని చెబుతూనే, మరోవైపు ధరలను పెంచి అంతకు రెట్టింపు తమ వద్ద వసూలు చేస్తున్నారని లక్ష్మి అనే గృహిణి వాపోయారు.

అమ్మ గెలుపు కోసం..

▸▸ అనిత తనయుడు నిఖిల్ ముమ్మర ప్రచారం



బోయపాడులో ప్రచారం చేస్తున్న అనిత కుమారుడు నిఖిల్

నక్కపల్లి, ఏప్రిల్ 28: పాయకరావుపేట నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిని వంగలపూడి అనితను ఎమ్మెల్యేగా గెలిపించాలంటూ ఆమె కుమారుడు నిఖిల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆదివారం బోయపాడులో ఎన్‌డీఏ కూటమి తరపున టీడీపీ, బీజేపీ,జనసేన నాయకులతో కలిపి ఎన్నికల ప్రచారం చేశారు. ఎమ్మెల్యేగా తన తల్లిని, ఎంపీగా బీజేపీ అభ్యర్థి సీఎం రమేశ్‌ను గెలిపించాలంటూ ఇంటింటా తిరిగి ప్రచారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

తెలుగుదేశంలో చేరిన వైసీపీ నాయకులు



రత్నాకర్ సమక్షంలో టీడీపీలోకి చేరిన వైసీపీ నాయకులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 28: స్థానిక డీవీఆర్ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ సమక్షంలో లక్ష్మీదేవిపేట వైసీపీ నాయకులు ఆదివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. దాడి రత్నాకర్ వీరందరికి టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ టీడీపీ బలోపేతానికి కష్టపడి పనిచేయాలని కోరారు. కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు దొడ్డి రాము, కొణతాల వాసు, రేబాక ఇంద్రకుమార్ పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్యులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న దొరస్వామి

అచ్యుతాపురం, ఏప్రిల్ 28: బ్రాండిక్స్ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 283 మందికి వైద్య పరీక్షలు జరిపారు. ఇందులో 182 మందికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. 20 మందికి శస్త్రచికిత్సలు చేయాలని వైద్యాధికారులు నిర్ధారించారు. మిగిలిన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. విశాఖలోని శంకర్ ఫౌండేషన్‌లో 20 మందికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయిస్తామని బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరస్వామి తెలిపారు. శిబిరానికి వచ్చిన వారందరికీ మజ్జిగ, ఫలహారాలు, భోజనాలు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం



ముత్యాలమ్మపాలెంలో ప్రచారం చేస్తున్న కూటమి నేతలు

పరవాడ, ఏప్రిల్ 28 : పెందుర్తి జనసేన అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబుతోపాటు అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌లను గెలిపించాలని కోరుతూ ఆదివారం ముత్యాలమ్మపాలెంలో కార్యకర్తలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరిగి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. గాజుగ్లాసు, కమలం పువ్వు గుర్తులపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు అర్జిల్లి అప్పలరాజు, అర్జిల్లి రవి, వి.సోమశేఖర్, సమ్మంగి అప్పారావు, సీహెచ్ ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

'కూటమి అభ్యర్థులకే దివ్యాంగుల ఓటు'



మాట్లాడుతున్న దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు ఫణీంద్ర

కొత్తూరు, ఏప్రిల్ 28 : కూటమి అభ్యర్థులకే దివ్యాంగుల ఓటు అని టీడీపీ అనకాపల్లి నియోజకవర్గ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు నాథముని ఫణీంద్రకుమార్ అన్నారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో జరిగిన దివ్యాంగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలో కనీసం దివ్యాంగుల గురించి ప్రస్తావన లేకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నారా చంద్రబాబు నాయుడు గత ప్రభుత్వంలో దివ్యాంగులకు ఎంతో మేలు చేశారన్నారు. రూ.500లున్న పెన్షన్‌ను రూ.3000లు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత దివ్యాంగులకు చేసిన మేలు ఒక్కటీ లేదన్నారు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలన్నారు. కూటమి అధికారంలోకి రాగానే రూ.6వేలు పెన్షన్ ప్రకటించిన కూటమి ప్రభుత్వానికే తమ ఓటు అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో లక్ష్మీనారాయణ, కనకరాజు, అప్పారావు పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమి అభ్యర్థులకే మద్దతు

▸▸ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యలక మల్లిబాబు



మాజీ ఎమ్మెల్యే వి.అనితను కలిసిన ఎమ్మార్పీఎస్ నేతలు

పాయకరావుపేట, ఏప్రిల్ 28 : వచ్చే ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి తరపున పోటీ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు ఎమ్మార్పీఎస్ మద్దతు ఇస్తున్నట్టు జిల్లా అధ్యక్షుడు యలక మల్లిబాబు ప్రకటించారు. ఆదివారం పాయకరావుపేట టీడీపీ అభ్యర్థిని వంగలపూడి అనితను ఎమ్మార్పీఎస్ నాయకులు కలిసి తమ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మల్లిబాబు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి తరపున పోటీచేస్తున్న అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం.రమేశ్, పాయకరావుపేట అభ్యర్థిని వంగలపూడి అనితకు మద్దతు ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి గంపల చినరాజు, జిల్లా అధికార ప్రతినిధి కొల్లి చినఅప్పారావు, కోశాధికారి చెవ్వేటి అప్పారావు, నాయకులు కె.కనకేశ్వరరావు, జి.ఆనంద్ పాల్గొన్నారు.

షుగర్ ఫ్యాక్టరీల భవిష్యత్తుపై సీఎం జగన్ స్పష్టత ఇవ్వాలి: సీపీఐ



సీపీఐ జిల్లా నేత రెడ్డిపల్లి ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన

చోడవరం, ఏప్రిల్ 28: జిల్లాలో మూతపడిన షుగర్ ఫ్యాక్టరీల భవిష్యత్తుపై ముఖ్యమంత్రి జగన్ స్పష్టమైన హామీ ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్ చేశారు. సోమవారం చోడవరంలో సీఎం జగన్ సభ నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆదివారం స్థానిక పాతబస్టాండ్ వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ, జిల్లాలో సహకార షుగర్ ఫ్యాక్టరీలు తెరిపించి రైతాంగాన్ని ఆదుకోవడంతో పాటు, ఉపాధి లభించక జిల్లాలోని కూలీలవలసల నిరోధానికి ఏంచర్యలు తీసుకుంటారో చెప్పాలని కోరారు. రైతులకు రూ.2లక్షల 50వేలు రుణమాఫీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యకర్తలు తాతబాబు, శ్రీనివాసరావు, నాయుడు, వరహాలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు ఏర్పాట్లు

చోడవరం, ఏప్రిల్ 28: సీఎం జగన్ చోడవరంలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. పట్టణంలోని ప్రధాన రహదారిపై కొత్తూరు జంక్షన్‌లో సీఎం జగన్ బహిరంగ సభలో పాల్గొననున్నారు. ఈ మేరకు పట్టణ శివారులో హెలిపాడ్ నిర్మాణం చేపట్టారు. సీఎం బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీశ్రేణులకు విజ్ఞప్తి చేశారు.

మోదకొండమ్మ ఆలయంలో పూజలు

మాడుగుల, ఏప్రిల్ 28 : మాడుగుల కేంద్రంలోని మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆరు గంటల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కొంతమంది భక్తులు అమ్మవారి ఘటాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని ఘటాలను అమ్మవారికి సమర్పించుకున్నారు. స్థానిక న్యాయవాది శ్రీనాద ప్రసాదరావు, ప్రమోద్‌లు కలసి భక్తులకు ఉచిత అన్న సమారాధన చేశారు.



అలంకరణలో అమ్మవారు

భగ్గుమన్న భానుడు

మాడుగుల రూరల్, ఏప్రిల్ 28 : రోజు రోజుకి పగటి ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. దీంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. ఉదయం పది గంటలకే ఎండ జోరందుకుంటోంది. ఇక మధ్యాహ్నం వేళ మరీ దారుణంగా ఉంటోంది. రోడ్డుపైకి వచ్చేందుకు జనం భయపడిపోతున్నారు. అత్యవసర పనులపై బయటకు వచ్చినా ముఖాలకు తువ్వాలు, రుమాళ్ల కట్టుకుని నానా హైరానా పడుతూ ప్రయాణాలు సాగిస్తున్నారు. ఎండతీవ్రతకు జన సంచారం లేక రోడ్లు, జంక్షన్‌లు నిర్మానుష్యంగా మారుతున్నాయి.

ఊరించి ఉసూరుమనిపించిన వర్షం

ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు వాతావరణంలో మార్పు చోటుచేసుకుని ఆకాశమంతా మేఘావృతమైంది. వర్షం పడుతుందని భావించిన ప్రజలకు జల్లులు పడి వర్షం కనుమరుగైంది. కాస్తా వాతావరణం చల్లబడినప్పటికీ ఉక్కపోతతో ఇబ్బంది పడ్డారు.

తగ్గిన రైవాడ నీటిమట్టం



జలాశయంలో అడుగంటుతున్న నీటి నిల్వ

దేవరాపల్లి, ఏప్రిల్ 28 : మండలంలోని రైవాడ జాలాశయం నీటిమట్టం తగ్గుతోంది. జలాశయంలోకి వచ్చే పినకోట గెడ్డ, సమ్మెద గెడ్డల నుంచి నీరు రావడంతో తగ్గిపోవడంతో నీటి మట్టం ఆదివారానికి 104.92 మీటర్లకు చేరింది. జలాశయ గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లు కాగా, కనిష్ఠ నీటిమట్టం 100మీటర్లు. ప్రతి రోజు విశాఖ నగర పాలక సంస్థకు 50 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. గత మూడు రోజులు క్రితం వరకు ఆయకట్టుకు ఎడమ కాలువ ద్వారా 30 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు.

ధరల మంట

... 5వ పేజీ తరువాయి

ఆయిల్ ధర రూ.72 ఉండగా, ప్రస్తుతం రూ.95 ఉంది. అంటే, కిలోకు 23 రూపాయలు పెరిగింది. గతంలో వేరుశనగ నూనె కిలో రూ.102 ఉండగా, ప్రస్తుతం రూ.160కి చేరింది. పంచదార రూ.22 ఉండగా, ప్రస్తుతం రూ.48కి పెరిగింది. పెసరపప్పు గతంలో కిలో రూ.70 ఉండగా రూ.134కు, కందిపప్పు రూ.94 నుంచి 186కి చేరింది. ఐదేళ్ల కిందట 25 కిలో బియ్యం బస్తా బ్రాండ్‌ను బట్టి రూ.1000 నుంచి రూ.1200 మధ్యలో లభించేది. ప్రస్తుతం రూ.1,400 నుంచి రూ.1,800 మధ్య వెచ్చించాల్సి వస్తోంది. గతంలో మినపగుండ్ల ధర కిలో రూ.78 ఉండగా ప్రస్తుతం 156కు పెరిగింది. వీటితోపాటు అనేక సరకుల ధరలు రెట్టింపు, అంతకంటే ఎక్కువ పెరగడంతో సాధారణ మధ్య తరగతి ప్రజలపై భారం పడుతోంది.

రెట్టింపు అయిన భారం

ధరల పెరుగుదలతో ప్రతి ఇంటిపైనా ఆర్థికంగా భారం రెట్టింపు అయింది. సాధారణ, మధ్య తరగతి కుటుంబాలకు గతంలో నిత్యావసర సరకులకు నెలకు రూ.4 వేల నుంచి ఆరు వేలు ఖర్చయితే, ప్రస్తుతం ఎనిమిది వేల రూపాయల నుంచి రూ.12 వేల వరకు అవుతోంది. సరకులతోపాటు రోజువారీ కొనుగోలు చేసే కూరగాయలు, ఇతరత్రా అన్నింటి ధరలూ పెరిగాయని, మొత్తం నెలకు కనీసం రూ.15 వేలు ఖర్చవుతోందని వెంకోజీపాలెం ప్రాంతానికి నాగమణి అనే గృహిణి పేర్కొన్నారు. ఆదాయంలో పెరుగుదల లేకపోయినా ఖర్చు మాత్రం పెరిగిందని, ప్రభుత్వాలు నిత్యావసర సరకుల ధరలను అదుపులో ఉంచకుండా ప్రజలపై భారాన్ని మోపుతున్నాయని రామకృష్ణ అనే మెకానిక్ ఆవేదన వ్యక్తంచేశాడు. చాలీచాలని సంపాదనతో కుటుంబాన్ని పోషించుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయాడు. ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని చెబుతూనే, మరోవైపు ధరలను పెంచి అంతకు రెట్టింపు తమ వద్ద వసూలు చేస్తున్నారని లక్ష్మి అనే గృహిణి వాపోయారు.

గుర్రంపేట రహదారికి మోక్షమెన్నడో?

- టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.1.5 కోట్లు మంజూరు
- వైసీపీ పాలనలో పనులు రద్దు
- రాకపోకలకు ఏడు గ్రామాల ప్రజలు అవస్థలు

రోలుగుంట, ఏప్రిల్ 28: మండలంలోని గుర్రంపేట-బుచ్చెంపేట రహదారికి మోక్షం కలగలేదు. దీంతో గుర్రంపేటతో మరో ఏడు గ్రామప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో అప్పటి ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్. రాజు, అర్‌అండ్‌బీ శాఖ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు చొరవతో ఈ రహదారి నిర్మాణానికి రూ.1.5 కోట్లు నాబార్డు నిధులు మంజూరయ్యాయి. ఇక తమ కష్టాలు తొలగినట్లేనని జనాలు ఆనందం వ్యక్తంచేశారు. తర్వాత ఎన్నికలు జరిగి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నిర్మాణ పనులు అక్కడే ఆగిపోయాయి. ఈ గుర్రంపేట రహదారి ఏడు గ్రామాలకు ప్రయాణ మార్గం. మండలం కేంద్రం నుంచి గుర్రంపేట రహదారికి సుమారు 5 కిలో మీటర్లు ఉంటుంది. ఈ మార్గంలో వడ్డిప, బుచ్చెంపేట, నిండుగొండ, కె.నాయుడుపాలెం, అంట్లపాలెం, కిలపర్తిపాలెం, బిబిపట్నం, ఎం.కె.పట్నం గ్రామాలకు రాకపోకలు సాగిస్తుంటారు. గతంలో బలిరెడ్డి సత్యారావు మంత్రిగా ఉన్నప్పుడు నిధులు మంజూరు చేసి మట్టిరోడ్డుగా అభివృద్ధి చేశారు. అప్పటి నుంచి తారురోడ్డుగా నిర్మాణం జరగలేదు. ఆ ఏడు గ్రామాల ప్రజలు నిత్యం ఏదో పనిమీద మండల కేంద్రమైన రోలుగుంటకు వస్తుంటారు. దీంతో మట్టిరోడ్డు వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పటి టీడీపీ ఎమ్మెల్యే రాజు చొరవతో అప్పటి పంచాయతీరాజ్ శాఖ డీఈ సత్యనారాయణ, ఏఈ చంద్రశేఖర్ తదితరులు రహదారిని పరిశీలించి మ్యాపింగ్ సిద్ధం చేశారు. మొత్తం 3 కిలోమీటర్ల పరిధి గల ఈ రహదారికి రూ.1.5 కోట్లు నిధులు నాబార్డు నుంచి మంజూరు కావడంతో పనులు మొదలు పెట్టారు. రూ.25లక్షలతో మూడు కిలోమీటర్ల మేర ఎర్త్‌వర్క్ పూర్తిచేశారు. ఈలోగా 2019లో ఎన్నికల జరగడం, వైసీపీ ప్రభుత్వం ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ పనులను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది.



అధ్వాన్నంగా మారిన గుర్రంపేట రహదారి

ఈ ఐదేళ్లల్లో వైసీపీ ప్రభుత్వం మూడు సార్లు ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ఎవరూ బిల్లులు రావనే ఉద్దేశంతో ముందుకు రాకపోవడంతో మధ్యలోనే ఈ ప్రక్రియ రద్దు చేశారు. దీంతో ఆయా గ్రామ ప్రజలు రహదారి కష్టాలతో తీవ్ర అవస్థలు పడుతున్నారు.

అమలుకాని ఎమ్మెల్యే ధర్మశ్రీ హామీ



గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభమైన పనులు వైసీపీ అధికారంలోకి రావడంతో రద్దు చేశారు. ఈ ఐదేళ్లలో పలుమార్లు ఎమ్మెల్యే ధర్మశ్రీ వచ్చి రోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేస్తామని హామీ ఇచ్చినా తర్వాత దాని ఊసేలేదు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

-రాజాన రాంబాబు, గ్రామస్థుడు, గుర్రంపేట



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎం రమేష్



సమ్మేళనంలో పాల్గొన్న యువత

చోడవరానికి ప్రత్యేక గుర్తింపు తెస్తా..

- అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్
- వలస నివారణకు చర్యలు
- అభివృద్ధి నిరోధకులు ధర్మశ్రీ, జగన్

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 28: కూటమి అభ్యర్థులను గెలిపిస్తే చోడవరం నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపును తీసుకువస్తానని అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ అన్నారు. ఆయన ఆదివారం రాత్రి కోమళ్లపూడిలో జరిగిన యువసమ్మేళనం కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ, చోడవరం టీడీపీ అభ్యర్థి కెఎస్‌ఎన్‌ఎస్.రాజుతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనకాపల్లి జిల్లాలో నియోజకవర్గాలు ఒక్కో రంగంలో గుర్తింపు పొందగా, చోడవరం మాత్రం అన్నింటా వెనుకబడిందన్నారు. పాలకుల తీవ్ర నిర్లక్ష్యానికి సాగునీటి రంగం దెబ్బతినడంతో ఆయకట్టుకు నీరందక రైతులు నష్టాల్లో కూరుకుపోయారన్నారు. దీంతో స్థానికంగా చేయడానికి పనులు లేక ఉపాధి కోసం ప్రజలు సుదూర పాంతాలకు వలస పోతున్నారన్నారు. స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పనకు పరిశ్రమల స్థాపన ద్వారా యువతకు, ప్రజలకు ఉపాధి కల్పించవచ్చునన్నారు. షుగర్ ఫ్యాక్టరీలు పురోగతి సాధన, రైతు, మహిళా సాధికారత కల్పన, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానన్నారు. వైసీపీ అసమర్థత,అవినీతి పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. ఒక్కఛాన్సు ఇచ్చిన పాపానికి అటు సీ ఎం జగన్, ఇటు ఎమ్మెల్యే కె.ధర్మశ్రీలు అభివృద్ధిని తుంగలో తొక్కారని విమర్శించారు. అవినీతి పాలనతో పబ్బం గడుపుకున్న వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడాలని కోరారు. ప్రధానిగా మోదీ, సీఎంగా చంద్రబాబులతోనే పురోగతి సాధ్యపడనున్నందున ఎంపీ అభ్యర్థిగా తనకు, చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థిగా రాజుకు గెలిపించాలని సీఎం రమేష్ కోరారు. ఈ సమ్మేళనంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు గేదెల సత్యనారాయణ, జి.కోటేశ్వరరావు, తమరాన దాసు, సీతా నాగరాజు పాల్గొన్నారు.

రహదారిపై మురుగునీరు.. రాకపోకలకు అవస్థలు

- తట్టబంద సెంటర్‌లో దుస్థితి

రావికమతం, ఏప్రిల్ 28: మండలంలో తట్టబంద జంక్షన్ నాలుగు రోడ్ల కూడలిలో మురుగు నీటితో న్సి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉన్న ఈ రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ సౌకర్యంలేదు.దీంతో ఈ రోడ్డు పైభాగంలో ఉన్న కాలనీవాసుల ఇళ్లనుంచి, రోడ్డుకు ఇరువైపులా ఉన్న నివాసవాసుల వాడుక నీరు రోడ్డుపై నిలిచి తీవ్ర దుర్గంధం వెద జల్లుతోంది. వేసవిలోనే ఈ విధంగా ఉంటే ఇక వర్షాకాలంలో మరింత దుర్భంగా మారుతోంది. దీనికి తోడు నిత్యం క్వారీ లారీల రాకపోకలతో రహదారి మరింత ధ్వంసమైంది. ఈ గోతుల్లో మురుగు నీరు చేరి మరింత ఇబ్బందిగా మారుతోంది. గోతుల్లో పడి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వాహనాలు వచ్చే సమయంలో ఈరోడ్డు పక్కన ఉండే వారిపై మురికినీరు పాదచారులపై తుళ్లిపోతోంది. గ్రామ సర్పంచ్ గోకివాడ రమణతో పాటు పలువురు గ్రామస్థులు ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి సమస్య తీసుకువెళ్లినా పట్టించుకోకపోవడంతో వాహన చోదకులు,ప్రజలు నరక యాతనకు గురౌతున్నారు. కనీసం రోడ్డుపై నిల్చిన మురుగునీరు బయటకువెళ్లేలా చర్యలు చేట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.



తట్టబంద జంక్షన్‌లో గోతుల్లో మురుగునీటి నిల్వతో ఉన్న రహదారి

దొర్లవీధిలో తాగునీటికి కటకట

చీడికాడ, ఏప్రిల్ 28: మండలంలో దండిసురవరం గ్రామంలోని దొర్లవీధిలో మంచినీరు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులుపడుతున్నామని పలువురు మహిళలు వాపోతున్నారు. వేసవి కాలం కావడంతో ప్రతిరోజు ఉదయం సమయంలో ఒక గంటమాత్రమే పంచాయతీ కొళాయి నుంచి నీరు వస్తుందని అన్నారు. అది కూడా పూర్తిస్థాయిలో రాకపోవడంతో ఇబ్బం దులు పడుతున్నామన్నారు. మధ్యాహ్న సమ యంలో ఇదే విధంగా కొళాయిలనుంచి నీటినిసరఫరా చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో గ్రామానికి దూరంగా ఉన్న పొలంలోకి వెళ్లి నీరు తెచ్చుకోవాల్సి వస్తుందని అన్నారు. అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో తాగునీరు అందేలా చూడాలని కోరారు.



దండిసురవరం దొల్లవీధిలో కొళాయి వద్ద ఖాళీ బిందెలు



రామన్నపాలెం కూడలి వద్ద ట్యాంకర్‌లో నింపుతున్న నీరు



అదే రోడ్డులో లారీలతో నల్ల రాయిని తరలిస్తున్న దృశ్యం

ఏలేరు కాలువలో నీటి చౌర్యం

రోజూ సుమారు 20 ట్యాంకుల తరలింపు.. పట్టించుకోని అధికారులు

మాకవరపాలెం, ఏప్రిల్ 28: విశాఖపట్నం పరిశ్రమలతో పాటు పట్టణ వాసుల తాగునీటి అవసరాలకు వాడుతున్న ఏలేరు కాలువ నీరు చౌర్యానికి గురవుతోంది. పట్టపగలే కాలువలో నీటిని అక్రమంగా తరలిస్తున్నా అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఏలేరు కాలువ గట్టును చదను చేసి సుమారు నాలుగు కిలోమీటర్ల మేర మట్టి రోడ్డు వేశారు. దూళి రాకుండా ప్రతి రోజూ సుమారు 20 ట్యాంకర్ల నీటితో రోడ్డు తడుపుతున్నారు. దీనికోసం మొన్నటి వరకూ రామన్నపాలెం జగనన్న కాలనీలో ఉన్న బోరు నుంచి నీటిని చౌర్యం చేశారు. ఇప్పుడు దర్జాగా ఏలేరు కాలువలో పట్టపగలు డీజిల్ ఇంజన్ ద్వారా ట్యాంకర్ నీటితో నింపి రోడ్డును తడుపుతున్నారు. ప్రతి రోజూ ఏలేరు కాలువ నీరు చౌర్యం చేయకుండా పర్యవేక్షణ చేస్తుంటారు. అయితే రామన్నపాలెం వద్ద ఏలేరు కాలువ 103 కిలోమీటరు వద్ద పట్టపగలు నీటి చౌర్యం చేస్తున్నా సంబంధింత అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి నీటి చౌర్యం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

షుగర్ ఫ్యాక్టరీల అభివృద్ధి ఉత్తి మాటేనా?

... 5వ పేజీ తరువాయి

మూలుగుతూ నడుస్తున్నది. గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో వంద కోట్ల రూపాయలతో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు కూడా ప్రకటనలకే పరిమితమైంది. ఈ ఫ్యాక్టరీ పరిస్థితి కూడా నేడో, రేపో మూతపడడం ఖాయం అన్న చందంగా దిగజారింది. సహకార షుగర్ ఫ్యాక్టరీలను అభివృద్ధి పథంలో నడిపిస్తామంటూ నాడు జగన్ ఇచ్చిన హామీకి భిన్నంగా జిల్లాలోని సహకార ఫ్యాక్టరీలు మూతపడినప్పటికీ, ప్రభుత్వపరంగా ఎలాంటి చేయూత లభించకపోవడంపై చెరకు రైతులు, కార్మికులు నిరాశ చెందుతున్నారు. అయితే ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ ఏం నివేదిక ఇచ్చిందో, మంత్రివర్గ ఉపసంఘం ఏ రకమైన నిర్ణయాలు తీసుకున్నదో అనే విషయాలు ఇప్పటికీ వెలుగులోకి రాలేదు. సహకార షుగర్ ఫ్యాక్టరీలను లాభాల బాట పట్టిస్తామని నాడు జగన్ హామీ ఇచ్చి ఇప్పుడు ఫ్యాక్టరీలు మూత పడుతున్నా పట్టనట్టు వ్యవహరిస్తున్నారని రైతులు, కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



గోవాడ షుగర్ ఫ్యాక్టరీని నాలుగేళ్ల క్రితం నిపుణుల కమిటీ సందర్శించినప్పటి చిత్రం



నిర్మానుష్యంగా ఉన్న చోడవరం-పెదబొడ్డేపల్లి మెయిన్ రోడ్డు

భానుడి భగభగ.. జనం విలవిల

నర్సీపట్నం అర్బన్, ఏప్రిల్ 28: భానుడు భగ్గుమంటున్నాడు. ఎండలు మండుతుండడంతో జనం విలవిలలాడుతున్నారు. ఓవైపు వేడి, మరోపక్క ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

మండలంలోని పెదబొడ్డేపల్లి, చెట్టుపల్లి, ధర్మసాగరం, కెఎల్.పురం, వేములపూడి, అమలాపురం, మెట్టపాలెం, గబ్బాడ, తదితర గ్రామాల్లో ఆదివారం ఎండలు తీవ్రంగా ఉన్నాయి. ఉదయం పది గంటల నుంచే వడగాల్పులు ప్రారంభమై సాయంత్రం ఏడు గంటల వరకూ కొనసాగాయి. దీంతో వాహన చోదకులు తీవ్రమైన ఇబ్బందులకు గురయ్యారు. అలాగే ఎప్పుడూ రద్దీగా ఉండే ప్రధాన సెంటర్లు ఎండల తీవ్రతకు జన సంచారం లేక బోసిపోతున్నాయి. ఉపాధి పనులకు వెళ్లే కూలీలు తలలుపై చెంగులు, తువాళ్లు వేసుకుని ప్రయాణాలు సాగిస్తున్నారు. వడగాల్పులుతో వృద్ధులు, చిన్నారులు ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు బయటకు రావడం లేదు.

1 నుంచి వేసవి క్రీడా శిక్షణా తరగతులు

నర్సీపట్నం అర్బన్, ఏప్రిల్ 28: పట్టణంలో వచ్చే నెల 1వ తేదీ నుంచి వేసవి క్రీడా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు నింజాస్ అకాడమీ డైరెక్టర్ వెలగా నారాయణరావు ఆదివారం తెలిపారు. నర్సీపట్నం మునిసిపాలిటీలో మే 1వ తేదీ నుంచి కరాటే, బాక్సింగ్, తైక్వాండో, యోగా, కిక్ బాక్సింగ్, స్కేటింగ్, వెయిట్ లిఫ్టింగ్ తదితర క్రీడలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఈ సమయంలో ఉచితంగా గుడ్డు, బిస్కెట్స్, పండ్లు, రాగిమాల్ట్ అందిస్తామన్నారు. ఆసక్తి గల వారు నర్సీపట్నంలోని నింజాస్ అకాడమీని సంప్రదించాలని ఆయన సూచించారు.

నత్తనడకన సరుగుడు రోడ్డు నిర్మాణం

- వాహన చోదకులు, ప్రయాణికుల అగచాట్లు



గతుకులతో అస్తవ్యస్తంగా ఉన్న సరుగుడు రహదారిల

నాతవరం, ఏప్రిల్ 28: మండలంలో సరుగుడు ఆర్‌అండ్‌బీ రహదారి నిర్మాణం నత్తనడకన సాగుతోంది. ఐదేళ్లుగా ఈ రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. 2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వం చమ్మచింత నుంచి సరుగుడు వరకు రోడ్డు నిర్మాణానికి రూ.12 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులలో కల్వర్టు పనులకు మెటల్ ఏర్పాటుకు సుమారు రూ.5 కోట్లు ఖర్చు చేసి మిగిలిన పనులు పూర్తి చేయకుండా వదలివేశారు. బిల్లులు మంజూరు కాకపోవడంతోనే పనులు నిలిపివేసినట్టు కాంట్రాక్టర్ చెబుతున్నారు. దీంతో వర్షాలకు రోడ్డులో అక్కడక్కడ గోతులు పడ్డాయి. ఫలితంగా సరుగుడు, సుందరకోట, రామన్నపాలెం తదితర గ్రామాల విద్యార్థులు, ప్రయాణికులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

ఆదరిస్తే.. అభివృద్ధి చేస్తాం

- సీఎం రమేష్ సతీమణి శ్రీదేవి వినతి



ఆర్యవైశ్య కుటుంబాల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న శ్రీదేవి

చోడవరం, ఏప్రిల్ 28: ఆర్యవైశ్యులకు అన్నివేళలా అండగా ఉంటామని. జిల్లా అభివృద్ధి చెందాలంటే అనకాపల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా సీఎం రమేష్‌కు అవకాశం ఇవ్వాలని సీఎం రమేష్ భార్య శ్రీదేవి హామీ ఇచ్చారు. ఆదివారం పట్టణంలోని కల్యాణ మండపంలో ఆర్య వైశ్య కుటుంబాల ఆత్మీయకలయిక కార్యక్రమానికి ఆమె హాజరయ్యా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కూటమి అభ్యర్థి సీఎం రమేష్‌తో పాటు, టీడీపీ అభ్యర్థి కేఎస్‌ఎన్‌ఎస్ రాజులను గెలిపిస్తే చోడవరం ప్రాంతం అభివృద్ధికి చొరవ తీసుకుంటారని స్పష్టం చేశారు. వైసీపీ నేతల మాదిరిగా వ్యాపారులకు ఎలాంటి వేధింపులు ఉండవని, వారు స్వేచ్ఛగా తమ వ్యాపారాలు చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాజు, తన పదవీకాలంలో చేసిన ప్రగతిని వివరించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గూనూరు మల్లునాయుడు, పెదబాబు, ఈర్లె శ్రీరామమూర్తి, సిరిపురపు రమేష్, దేవరపల్లి వెంకట అప్పారావు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ కుటుంబాలు

ఈ సందర్భంగా ఉమ్మడి విశాఖ జిల్లా బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ కోఆర్డినేటర్ కొమ్మనమంచి నరసింహమూర్తి ఆధ్వర్యంలో మండలంలోని జి. జగన్నాధపురం దళిత కాలనీకి చెందిన 15 వైసీపీకి చెందిన కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్ రాజు సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీలో వారిలో మాటూరి శ్రీనివాసరావు, మలకా నాగరాజు, శివగంగాధర్, చందు, గోవింద్, కొటాన అప్పారావు, మలక దుర్గ, దుర్గాప్రసాద్, నవీన్‌కుమార్, శంకరరావు, కొత్తపల్లి డేవిడ్ తదితరులు ఉన్నారు.

నేడు నామినేషన్ల ఉపసంహరణ

ఉత్కంఠంగా ఎదురు చూస్తున్న నాయకులు, కార్యకర్తలు

మాడుగుల, ఏప్రిల్ 28 : ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎమ్మెల్యే అభ్యర్థుల నామినేషన్ల ఉప సంహరణ గడువు సోమవారంతో ముగియనుంది. మాడుగుల నియోజవర్గంలో మొత్తం 14మంది అభ్యర్థులు 29 నామినేషన్లు దాఖలు చేశారు. టీడీపీ వైసీపీ నుంచి పోటీకి దిగిన ప్రధాన అభ్యర్థులు నామినేషన్లు జరిగిన స్క్రూటీనీలో ఆమోదించడంతో వారి తరఫున వేసిన డమ్మీ నామినేషన్లు తిరస్కరించారు. దీంతో ముగ్గురు అభ్యర్థులకు సంబంధించి ఆరు నామినేషన్లు తిరస్కరించడంతో 11మంది అభ్యర్థుల 23 నామినేషన్లు మిగిలాయి. అయితే, సోమవారం వీరిలో ఎంతమంది ఉపసంహరించుకుంటారో తెలియాల్సి ఉంది. అయితే టీడీపీ అభ్యర్థిగా బండారు సత్యనారాయణమూర్తి పోటీలో ఉండగా, అదే పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు నామినేషన్లు ఆఖరితేది చివరి క్షణాల్లో ఇండిపెండెంట్‌గా నామినేషన్ దాఖలు చేశారు. పైలా ప్రసాదరావు బరిలో ఉన్నారు. వీరిలో దాదాపుగా గవిరెడ్డి రామానాయుడు నామినేషన్ ఉపసంహరణ చేసుకున్నా, పైలా ప్రసాదరావు ఉపసంహరించుకుంటారా ? పోటీలో ఉంటారా ? అనే దానిపై సర్వత్ర ఉత్కంఠ నెలకొంది. ఇదిలా ఉండగ వైసీపీ నుంచి బరిలో నిలిచిన ఈర్లె అనురాధ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేసిన అఫిడవిట్‌లో శ్రీ దత్త పుణ్యగిరి చిట్స్‌కి సంబంధించి ఆర్థిక వనరుల వివరాలు పొందు పరచలేదని, ఆమె నామినేషన్ రద్దు చేయాలని పైలా ప్రసాదరావు ఇప్పటికే ఈసీకి పిర్యాదు చేశారు. అలాగే బండారు, గవిరెడ్డిల అఫిడవిట్‌లపై కూడా పైలా అభ్యంతరం తెలిపారు. పిర్యాదు చేసిన పైలా టీడీపీ కూటమిలోకి వస్తారా స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటారా అన్నది వేచి చూడాల్సిఉంది.